# భారత్ శక్తి ®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 282 | హైదరాబాద్ | మంగళవారం 05-05-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

హర్మూజ్ జలసంధిలో 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'.. అమెరికా భారీ ఆపరేషన్



# వేధిస్తే వదిలేది లేదు: కేటీఆర్

- అక్రమ కేసులు కాదు, పరిపాలన మీద దృష్టి పెట్టు
- రైతులు అల్లాడుతున్నరు
- నిన్న కరీంనగర్‌లో కాల్పులు జరిగినయ్
- శాంతి భద్రతలు కాపాడు
- పోలీసులు నీ ప్రైవేటు ఆర్మీనా
- 420 హామీలు, 13 డిక్లరేషన్లు అమలు చేసేదాకా ప్రశ్నిస్తూనే ఉంటం
- మన్నె క్రిశాంక్ పరామర్శలో రేవంత్ సర్కారుపై కేటీఆర్ ధ్వజం

11లో

## కేరళ కాంగ్రెస్ విజయం
# రేవంత్ రెడ్డి భావోద్వేగ ట్వీట్

- తన ప్రచారం సందర్భంగా ప్రజలు ఎంతో అభిమానం చూపించారన్న రేవంత్ రెడ్డి
- తెలంగాణ, కేరళలు ప్రగతిశీల విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి కలిగిన రాష్ట్రాలని వ్యాఖ్య
- కాంగ్రెస్‌ను గెలిపించుకోవడం ద్వారా అద్భుతమైన భవిష్యత్తుకు నాంది పలికారన్న సీఎం

11లో





11లో 11లో

## తమిళనాడు ఓటర్లకు మోదీ కృతజ్ఞతలు..
# విజయ్ పార్టీకి అభినందనలు

- తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏకు మద్దతిచ్చిన ప్రజలకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు
- నటుడు విజయ్, ఆయన పార్టీ తమిళగ వెట్రి కళగంకు తెలిపిన అభినందనలు
- తొలి ఎన్నికల్లోనే టీవీకే అద్భుత ప్రదర్శన కనబరిచిందని ప్రశంస
- తమిళనాడు అభివృద్ధి, సంక్షేమానికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని హామీ

## టీవీకే గెలుపు..
# కరూర్ మృతులకు నివాళి

- కరూర్ తొక్కిసలాట మృతులకు టీవీకే తమ చారిత్రక విజయం అంకితం
- తమిళనాడు ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన నటుడు విజయ్ పార్టీ
- మహిళల మద్దతుతోనే గెలిచామని, ఇది ఒక విప్లవమని పార్టీ నేతల వ్యాఖ్య
- ఎమ్మెల్యేల ఫిరాయింపుల భయంతో రిసార్టుకు తరలించే యోచనలో టీవీకే
- టీవీకేతో పొత్తుకు కాంగ్రెస్ పార్టీ సంసిద్ధత, అధిష్ఠానానికి నివేదిక

11లో





## భారత్‌పై ఆసిమ్ మునీర్ కొత్త కుట్ర..
# ఉగ్రవాదులను రెచ్చగొట్టడమే లక్ష్యం!

- భారత్‌పై పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ తీవ్ర ఆరోపణలు
- టీటీపీ, బీఎల్‌ఏ దాడుల వెనుక భారత్ ఉందని కొత్త ప్రచారం
- ఆపరేషన్ సిందూర్ వైఫల్యంతో పరువు కాపాడుకునే ప్రయత్నం

11లో




12లో

- ఉప్పల్ పోలీసుల చేతికి చిక్కిన ఫోర్జరీ ముఠా.. నిందితుల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారి
- పక్కా ప్లాన్‌తో వీవీఐపీ కోటాకు కన్నం.. లెటర్ హెడ్లు మార్చి మాయాజాలం





# రాజకీయ చరిత్రకు తమిళులే దిక్సూచి: కవిత

11లో

- రాజకీయ చరిత్రను తిరగరాసేందుకు కొత్త శక్తులు అవసరమన్న కవిత
- ఈ విషయాన్ని తమిళ ప్రజలు నిరూపించారన్న కవిత
- ఈ దేశానికి తమిళ ప్రజలు ఒక సంకేతం పంపించారని వ్యాఖ్య



## బెంగాల్‌లో విజయం సాధించాం..
# తదుపరి లక్ష్యం తెలంగాణ

- తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ జెండా ఎగురుతుందని ధీమా
- రాష్ట్ర పురోగతి డబుల్ ఇంజిన్ సర్కార్‌తో సాధ్యమని వ్యాఖ్య
- కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలకు ప్రజలు గుణపాఠం చెబుతున్నారన్న బీజేపీ

11లో

భారత శక్తి
VOICE OF INDIA

# ఓటర్ విలక్షణ తీర్పు...

అధికారంలో ఉన్న పార్టీలు.. అభివృద్ధిని చేసి చూపించాలి. అంతేగానీ.. సంక్షేమ పథకాలు ఇస్తే సరిపోదు. ప్రజలు అలాంటి పార్టీలను తిరస్కరిస్తున్నారు బెంగాల్‌లో మోదీ ఎన్నికలకు ముందు.. మహిళల అకౌంట్లలో మనీ వేశారు. దాంతో మహిళల ఓట్లు తమకే అనుకున్నారు. అడ్డంగా ఫెయిల్ అయ్యారు. ఏపీలో వైసీపీ కూడా పథకాల ద్వారా గెలుస్తామని అనుకుంది. ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. తమిళనాడులో డీఎంకే కూడా ఇలాగే దెబ్బైపోయింది. తెలంగాణలో బీఆర్ఎస్ కంటే.. ఎక్కువ పథకాలను ప్రకటించిన కాంగ్రెస్‌ని ప్రజలు గెలిపించారు. ఏపీలోనూ అదే జరిగింది. ప్రజలు పథకాలు ఎవరైనా ఇస్తారు.. ఎవరు ఎక్కువ ఇస్తే వారికే ఓటు అంటున్నారు. అదే సమయంలో.. పథకాలు మాత్రమే ఇస్తే, అలాంటి పాలనకు స్వస్తి పలుకుతున్నారు. అందువల్ల ఓటర్లను తక్కువ అంచనా వేసే పార్టీలకు షాకులు తప్పట్లేదు. తాజా ఫలితాలు ఇదే తెలియజేస్తున్నాయి. ప్రతీ రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉంటాయి. అవి జాతీయ పార్టీలను ఎట్టి పరిస్థితుల్లో అధికారానికి రానివ్వకుండా చూసుకుంటాయి. కానీ.. కొన్నేళ్లుగా ఈ పరిస్థితి మారుతోంది. ముఖ్యంగా కేంద్రంలో నరేంద్ర మోదీ సారధ్యంలో బీజేపీ, ఎన్డీయే సర్కార్ 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రాంతీయ పార్టీలు గల్లంతవుతున్నాయి. ఇందుకు బీజేపీ వ్యూహాలు ఒక కారణమైతే, ఆ పార్టీల స్వయంకృత అపరాధాలు మరో కారణం. జమ్మూకాశ్మీర్‌లో ఎన్సీ, హర్యానాలో ఒడిశాలో బిజూ జనతాదళ్, పంజాబ్‌లో శిరోమణి అకాలీదళ్, బెంగాల్‌లో తృణమూల్, కర్ణాటకలో జేడీఎస్, మహారాష్ట్రలో శివసేన ఇలా ఎన్నో ప్రాంతీయ పార్టీలు.. తమ ఉనికిని కోల్పోతున్నాయి. అధికారానికి దూరమై, కనీసం ప్రతిపక్షాలుగా కూడా ప్రభావం చూపలేకపోతున్నాయి. ఇక కాంగ్రెస్ పార్టీ కూడా ప్రభావం చూపలేకపోతోంది. మరికొన్ని సందర్భాల్లో.. బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీలు బలహీనపడుతున్నాయి. ఇక్కడ బీజేపీ తన ఎదుగుదలకు పునాదిని నిర్మించుకుంటోంది. అది ఆ పార్టీలకు సమస్య అవుతోంది. కచ్చితమైన విధానాలు, సిద్ధాంతాలు, పట్టుదల, బలమైన వ్యూహాల వంటివి కమలం ఎదుగుదలకు కారణం అవుతున్నాయి. మొన్నటిదాకా బీహార్‌లో బలంగా ఉన్న జేడీయూ.. ఇప్పుడు బీజేపీకి అధికారాన్ని అప్పగించుకుంది. ఐతే.. సౌత్‌లో మాత్రం బీజేపీ పెనట్రేట్ అవ్వలేకపోతోంది. కర్ణాటక తప్పితే.. మిగతా రాష్ట్రాల్లో ప్రభావం చూపలేకపోతోంది. భాషా ప్రాంతీయతా భావం ఇక్కడ బలంగా ఉండటం కమలానికి సవాల్ అవుతోంది. అయినప్పటికీ.. దేశవ్యాప్తంగా ఆ పార్టీ విస్తరిస్తున్న తీరు మాత్రం.. సంచలనమే. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో మనం ఒక కొత్త విషయాన్ని గ్రహించవచ్చు. ఏపీలో జనసేన పార్టీ ఒంటరిగా పోటీ చెయ్యకుండా.. టీడీపీతో కూటమిగా పోటీ చేసి.. గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ఈ పొత్తు వల్ల ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలలేదు. కానీ తమిళనాడులో విజయ్ ఇలా చెయ్యలేదు. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోలేదు. దాంతో.. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలినా.. ఎక్కువ ఓట్లు తనకే దక్కేలా చేసుకున్నారు. ఫలితంగా సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఇప్పుడు టీవీకే అవతరించింది. మెజార్టీ మార్క్ రాకపోయినా.. మరో 10 సీట్లతో పవర్ లోకి వచ్చేయవచ్చు. ఇందుకోసం చిన్న చిన్న పార్టీలతో పొత్తు పెట్టుకోవచ్చు. ఇలా ఒంటరిగా పోటీ చేసి బలమైన పార్టీగా ఎదగడం వల్ల ఇప్పుడు టీవీకే.. సొంతంగా అధికారంలోకి వచ్చే పరిస్థితిని తెచ్చుకుంది. ఈ ఛాన్స్ జనసేన తెచ్చుకోలేకపోయింది. ఏపీలో ఇప్పుడు జనసేన.. రెండో పెద్ద పార్టీగా ఉంది. కానీ.. టీడీపీతో పోల్చితే.. జనసేనకి ఉన్నవి 21 సీట్లే. నెక్ట్స్ ఎన్నికల్లో ఆ పార్టీ బలంగా ఎదగాలంటే.. ఒంటరిగా పోటీ చెయ్యాల్సి ఉంటుంది. కానీ.. 15 ఏళ్లు పొత్తుతోనే వెళ్తామని చాలాసార్లు డీసీఎం పవన్ కళ్యాణ్ చెప్పారు. అలా పొత్తుతో వెళ్లినంతకాలం.. జనసేన ఎదిగే అవకాశాలు ఉండవు. సీట్ల సర్దుబాటులో.. కొన్ని సీట్లతోనే సర్దుకోవాల్సి ఉంటుంది. అలాగే పవన్ కళ్యాణ్ సీఎం అయ్యే చాన్స్ కూడా మిస్సవుతుంది. అందుకే విజయ్.. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా.. ఇప్పుడు సీఎం అయ్యే ఛాన్స్ పొందారు. ఇదే జనసేనకి మైనస్ అవుతుంటే.. విజయ్‌కి ప్లస్ అయ్యింది. అఫ్‌కోర్స్ తమిళ పాలిటిక్స్ వేరు, మన ఏపీ పాలిటిక్స్ వేరు.. కానీ పరిస్థితులు అలా అయ్యాయని అనుకోవచ్చువిజయ్ వంటి కొత్త నాయకుడు రాజకీయాల్లోకి అడుగుపెట్టడం, ఆయన పార్టీకి వచ్చిన ఆధిక్యాలు చూస్తే, సహజంగానే అందరి దృష్టి పడింది. దీని నుంచి అనుభవజ్ఞులైన నాయకులు సైతం గమనించగల కొన్ని విస్తృత రాజకీయ పాఠాలు ఉన్నాయి. ముఖ్యమైన పాఠాలలో ఒకటి కథనం, భావోద్వేగ అనుబంధ శక్తి. విజయ్ పట్ల ఆదరణకు కారణం, సంవత్సరాల తరబడి జాగ్రత్తగా తీర్చిదిద్దుకున్న తెరపై ఆయన ఉనికి. ఇది పెద్ద సంఖ్యలో మద్దతుదారులతో ఒక సిద్ధమైన భావోద్వేగ బంధంగా రూపాంతరం చెందింది. సినిమాల్లో ఆయన చెడును ప్రశ్నించే ధోరణి.. ప్రభుత్వాలకు ముఖ్యంగా బీజేపీకి వ్యతిరేకంగా నడుచుకునే ధోరణి.. ప్రాంతీయ తత్వం, ద్రవిడ వాదాన్ని బలపరిచింది. బీజేపీని వ్యతిరేకించేవారికి.. విజయ్ బలమైన సపోర్టర్‌గా నిలిచాడు. మరొక అంశం ప్రసంగాలు. విజయ్ ప్రసంగాలన్నీ దూకుడుగా, సూటిగా, సుత్తిలేకుండా సాగాయి. అలాగే.. ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోశాయి. పూర్తిగా డీఎంకేని బలంగా టార్గెట్ చేశారు. దాంతో డీఎంకేని వ్యతిరేకించేవారికి.. విజయ్.. బలమైన ఆల్టర్నేట్‌గా కనిపించాడు. అదే సమయంలో అన్నాడీఎంకే.. అంతర్గత కల్లోలాలతో.. బలమైన నాయకత్వాన్ని ప్రజలకు చూపలేకపోయింది. దీంతో.. ప్రభుత్వ వ్యతిరేక ఓటు.. టీవీకేకి షిఫ్ట్ అయ్యింది. మన తెలుగు రాష్ట్రాల్లో అభిమానులు.. ఓట్లు వేస్తారనే గ్యారెంటీ లేదు. ఈ కారణంగానే ఇదివరకు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్.. రెండుచోట్ల పోటీ చేసి కూడా ఓడిపోయారు. ఆ తర్వాత ఈ లోటును గుర్తించిన ఆయన.. 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో.. అభిమానులను.. అభిమానం కాదు.. ఓటు వెయ్యాలి అని పదే పదే చెప్పడం వల్ల.. 100 శాతం స్ట్రైక్ రేటును సాధించగలిగారు. తమిళనాడులో తీరు వేరు అక్కడి ప్రజలు.. సినీ నేతలను విపరీతంగా అభిమానిస్తారు. అందువల్ల ఎన్నికల్లో పాల్గొనగానే.. బలంగా గెలిపిస్తారు. ఇది విజయ్‌కి బాగా సెట్ అయ్యింది. విజయ్ ఈ గెలుపు.. 27 నెలలది మాత్రమే కాదు. కొన్నేళ్లుగా ఆయన నిర్మించుకున్న అభిమాన సౌధానికి ఇది ప్రతిఫలం లాంటిది. బీజేపీకి వ్యతిరేకంగా ఆయన వినిపించిన వాణికి ఇది ప్రాంతీయ భాషా సపోర్టర్ల నుంచి వచ్చిన సపోర్టు లాంటిది. ఇలా విజయ్ వ్యక్తిత్వం, నాయకత్వం, మాట్లాడే తీరు, నడుచుకునే వ్యవహార శైలి అన్నీ కలిసి.. ఈ విజయం దక్కేలా చేశాయి. మరో వైపు 2024 లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ మార్క్ రాక, 240 సీట్లకే పరిమితమైన బీజేపీ.. ఆ తర్వాత పుంజుకున్న విధానం ఓ చరిత్ర. వరుసపెట్టి మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ ఇలా చాలా రాష్ట్రాల్లో అధికారంలోకి వస్తూ.. ఇప్పుడు 42 లోక్ సభ స్థానాలున్న బెంగాల్‌ని తమ సొంతం చేసుకుంది. అలాగే.. అసోం, పుదుచ్చేరిలో పట్టు నిలుపుకుంది. ఇది బీజేపీకి పెద్ద బూస్ట్. కమలానికి ఇదెలా సాధ్యమవుతుంది అంటే.. సింపుల్ ఆన్సర్ ఉంది. మిషన్ మోడ్. మిగతా పార్టీలు ఎన్నికలు వచ్చినప్పుడే.. మిషన్ మోడ్‌లో ఉంటాయి. బీజేపీ అలా కాదు.. ఎప్పుడూ అలాగే ఉంటుంది. చిన్న ఎన్నికను కూడా ఆ పార్టీ తేలిగ్గా తీసుకోదు.

# వైసీపీ గ్రాఫ్ పెరిగిందా...



విజయవాడ, ,మే 4 (భారత శక్తి ):

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. అందులో మూడు ప్రధాన పార్టీలు ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో అతి పెద్ద పార్టీగా క్షేత్ర స్థాయి వరకు విస్తరించి ఉన్న పార్టీ. ఆ పార్టీ చరిత్ర నాలుగు దశాబ్దాలు. ఇకపోతే జనసేన పార్టీకి సినీ గ్లామర్ ఇమేజ్ ఉన్న పవన్ కళ్యాణ్ అధినేత. ఒక బలమైన సామాజిక వర్గం మద్దతు కూడా ఉన్నది. ఇక కేంద్రంలో నరేంద్ర మోడీ వంటి ఆకర్షణీయమైన నాయకత్వం బిజెపికి శ్రీరామరక్షగా ఉంది. అలాగే కూటమి ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం అండగా ఉండడం కూడా మరో సానుకూల పరిణామం. ఇక ప్రతిపక్షం వైపు చూస్తే వైసిపి ఉంది. ఆ పార్టీ మూడు సార్లు ఎన్నికల్లో పోటీ చేస్తే ఒకసారి మాత్రమే గెలిచింది. వైసీపీకి సర్వసత్తాక నాయకుడు వైఎస్ జగన్. 2019కి ముందు జగన్ కి ఉన్న ఇమేజ్ ఆకాశాన్ని అంటింది. దానికి కారణం తీసుకుంటే వైయస్సార్ వంటి ప్రజాకర్షణ కలిగిన నాయకుని కుమారుడిగా జగన్ ఆకర్షించారు. అదే విధంగా జగన్ కూడా దూకుడు తో కూడిన రాజకీయం అప్పట్లో చేస్తూ వచ్చారు. ఇవన్నీ కలసి వైసీపీ అధికారంలోకి వస్తే ఖచ్చితంగా మంచి జరుగుతుందని భావించి అన్ని వర్గాలు 2019 ఎన్నికల్లో ఆ పార్టీకి పట్టం కట్టాయి. అయితే 2024లో వైసీపీ ఓటమి చెందాక గత రెండేళ్ళలో వైసీపీలో పెద్దగా ఉత్సాహం అయితే ప్రోత్సాహం కనిపించట్లేదు అని అంటున్నారు. ఆ పార్టీ అధినాయకుడు కూడా తరచూ జనాల్లోకి రావట్లేదు, ఈ నేపథ్యంలో చూస్తుండగానే కాలం గడిచిపోతోంది. ఇక అధికార కూటమి కీలక ఘట్టంలోకి ప్రవేశించింది. అంటే ప్రభుత్వం పట్ల ప్రజలకి అమ్మ నెమ్మదిగా అసంతృప్తి బాహటం అయ్యేందుకు అవకాశం ఉన్న వాతావరణ అన్న మాట. వివిధ వర్గాలలో అది బయటపడే సమయానికి అందుబాటులో ఉన్న ప్రతిపక్షం దాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా బలోపేతం అవుతుంది. ఇది ఎక్కడైనా జరిగే సహజ రాజకీయ ప్రక్రియ. ఆంధ్రప్రదేశ్ లో చూస్తే అటువంటి పరిస్థితి ఉందా అన్నది ప్రశ్న ఎదురవుతోంది. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ ప్రధాన ప్రత్యక్షంగా ఉంది, 40 శాతం ఓటు బ్యాంకు కూడా పార్టీకి ఉంది. కేవలం 11 సీట్లు అని ఆ పార్టీని కొట్టి పారేయడానికి లేదు. పైగా మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఒక ఇమేజ్ ఉన్న అధినేతగా జగన్ వైసీపీకి నాయకత్వం వహిస్తున్నారు. ఇంకా చెప్పాలంటే ఒక బలమైన సామాజిక వర్గం అండ కూడా ఆ పార్టీకి ఆంగ బలం అర్ధ బలం కూడా ఉన్నాయి .ఇక ఇన్ని రకాలుగా అనుకూలతలు ఉన్నా కూడా వైసీపీ జనంలోకి ఊహించినంతగా వెళ్ళలేకపోతోంది. పార్టీ నాయకులు కూడా మీడియాకే పరిమితం అవుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు వందలూ వేలుగా కనిపించిన నాయకులు ఇప్పుడు ఐదు పదిగా మాతమే కనిపిస్తున్నారు. అది కూడా మీడియాలోనే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఇక అధినేత కూడా జనంలోకి వెళ్ళడం పాదయాత్రతోనే అన్నట్టుగా ఆలోచిస్తున్నారని ప్రచారంగా ఉంది. ఇవన్నీ పక్కన పెడితే రెండేళ్ల కూటమి పాలన పూర్తి చేసుకున్న సమయంలో సహజంగా ఏర్పడే ప్రజా వ్యతిరేకత అలాగే ఎంతో కొంత అసంతృప్తి ప్రతిపక్షానికి కలసి రావాలి. అదే విధంగా వైసీపీ గ్రాఫ్ ఈసరికే ఎంతో కొంత పెరిగి ఉండాలి. అంటే ఆ పార్టీకి 2024 లో వచ్చిన 40 శాతం ఓటు బ్యాంకుకి కనీసం రెండు మూడు శాతం అదనంగా పెరిగి ఉండాల్సింది. కానీ పరిస్థితి చూస్తే ఆ విధంగా కనిపించట్లేదు అని ఫ్యాన్ పార్టీలోనే చర్చ సాగుతోంది. కూటమి పట్ల వ్యతిరేకత ఉందని వైసీపీ నేతలు అంటున్నా అది తమ పార్టీ వైపుగా సానుకూలంగా మారకపోవడమేంటి అని వైసీపీలో తర్జనభర్జన పడుతున్నారని టాక్. వైసీపీ ఈ విషయంలో ఏం చేసింది ఏం చేయాలి అన్నదానిమీద కూడా పార్టీ సీనియర్లు కొంతమంది మదనపడుతున్నారని అంటున్నారు. అధినేత చూస్తే ఇప్పట్లో జనంలోకి వచ్చే అవకాశం అన్నది లేదు. దాంతో కూటమి పట్ల ఏమాత్రం అయినా ఏర్పడిన వ్యతిరేకత సానుకూలంగా మార్చుకోవాలని వైసీపీ చేస్తున్న ప్రయత్నాలు పెద్దగా సక్సెస్ కావట్లేదు అని అంటున్నారు. రెండేళ్ల పరిపాలన తర్వాత కూడా కూటమి ఇంకా అదే దూకుడు ప్రదర్శిస్తూ ముందుకు సాగుతోంది. ఎన్నికల ముందు వైసీపీని ఏ విధంగా చీల్చి చెండాడుతూ విమర్శలు చేసిందో అదే విధంగా ఇప్పుడు కూడా చేస్తోని. దానికి ధీటైన కౌంటర్లు వైసీపీ నుంచి రావడం లేదని అంటున్నారు. అవి జనంలోకి : దాంతో గొడ్డలి పార్టీ అని జగన్ మానసిక వ్యాధితో బాధపడుతున్నారని కూటమి పెద్దలు చేస్తున్న విమర్శలు జనంలోకి మెల్లగా వెళుతున్నాయా అన్న ఆందోళన కూడా వైసీపీ వర్గాల్లో ఉంది. కూటమి ప్రభుత్వం మీద పోరాటం చేసే విధంగా వైసీపీ తగినంత సరంజామాతో ముందుకు రాలేకపోతోంది. ఇవన్నీ చూస్తూ ఉంటే పుణ్య కాలం గడుస్తోందా అన్నది ఒక ప్రశ్న. అధినాయకత్వం విషయం చూస్తే పాదయాత్రతోనే అన్ని మారిపోతాయన్నట్లుగానే ఉంది. దీంతో వైసీపీ గ్రాఫ్ పెరగకపోతే కనుక రానున్న కాలంలో ఇబ్బందులు వస్తాయని కూడా సీనియర్ల అంతర్మథనం చెందుతున్నట్లుగా తెలుస్తోంది.

# ఏపీలో స్వచ్ఛ రథాలు

విజయవాడ,,మే 4 (భారత శక్తి ):

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ ఇప్పుడు ఒక సామాజిక ఉద్యమంగా మారింది. "మన పారిశుధ్యం.. మన ఆరోగ్యం.. మన బాధ్యత" అని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన పిలుపు క్షేత్రస్థాయిలో ఫలితాలను ఇస్తోంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో పురుడుపోసుకున్న 'స్వచ్ఛ రథాలు' పల్లెల్లో చెత్తను సంపదగా మారుస్తూ సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. గత ఏప్రిల్ నెలలో ఈ స్వచ్ఛ రథాలు సాధించిన ప్రగతి అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పల్లెల నుంచి రికార్డు స్థాయిలో సుమారు 19 లక్షల కేజీల పొడి చెత్తను ఈ రథాలు సేకరించాయి. కేవలం సేకరించడమే కాకుండా, 'చెత్త నుంచి సంపద' సృష్టి అనే యజ్ఞంలో భాగంగా ఆ వ్యర్థాలకు బదులుగా రూ. 3.32 కోట్ల విలువైన నిత్యవసర వస్తువులను ప్రజలకు పంపిణీ చేశారు. అంటే?. ఒకప్పుడు పనికిరాదని పారేసిన వస్తువులే నేడు గ్రామీణ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నాయిప్రభుత్వం చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు టాలీవుడ్ ప్రముఖ నటుడు నాని తన వంతు సహకారాన్ని అందించారు. పారిశుధ్యంపై అవగాహన కల్పించే ప్రచార కార్యక్రమాల్లో ఆయన భాగస్వాములయ్యారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయమని చెప్పడమే కాకుండా, అలా చేసిన వారికి బహుమతులు ఇచ్చి ప్రోత్సహించడం గొప్ప ఆలోచన అని నాని అభిప్రాయపడ్డారు. "పర్యావరణం కోసం పవన్ కళ్యాణ్ చేస్తున్న ఈ కృషికి అభినందనలు. మీకు మద్దతుగా నిలిచే కోట్లాది మందిలో నేను కూడా ఒకడిని'' అంటూ నాని తన అభిమానాన్ని చాటుకున్నారు."గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను సులభతరం చేసేందుకు కూటమి ప్రభుత్వం స్వచ్ఛరథాలను తీసుకువచ్చింది. వీటి గురించి ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు అడిగిన వెంటనే తన వంతు సహాయ సహకారాలు అందించిన నానికి పవన్ కళ్యాణ్ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం" అంటూ ఉపముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటన కూడా విడుదల చేసిందిభవిష్యత్తు తరాలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఈ పథకంలో ఒక వినూత్న కోణాన్ని చేర్చారు. ప్రతి గురువారం ఈ స్వచ్ఛ రథాలు నేరుగా పాఠశాలల వద్దకు వెళ్తాయి. విద్యార్థులు తమ ఇళ్ల నుంచి సేకరించిన పొడి చెత్తను అక్కడ అందజేస్తే, దానికి బదులుగా వారికి అవసరమైన పెన్నులు, పెన్సిళ్లు, పుస్తకాలు వంటి స్టేషనరీ సామాగ్రిని అందిస్తున్నారు. ఈ విధానం వల్ల పిల్లల్లో వ్యర్థాల నిర్వహణపై చిన్నతనం నుంచే బాధ్యత పెరుగుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన 'స్వచ్ఛ భారత్' స్ఫూర్తితో, ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశించిన 'స్వచ్ఛ ఆంధ్రా' లక్ష్యాలను చేరుకోవడమే ఈ స్వచ్ఛ రథాల ప్రధాన ఉద్దేశం. కేవలం రోడ్లను శుభ్రం చేయడమే కాకుండా, ఆ చెత్తను రీసైక్లింగ్ చేసి ఆర్థిక ప్రయోజనాలు కల్పించడం ద్వారా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్తున్నారు. ఈ విప్లవాత్మక మార్పు పల్లె ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే కాకుండా? ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి బాటలు వేస్తోంది.

# విశాఖకు భారీగా గ్యాస్....

విశాఖపట్టణం, ,మే 4 (భారత శక్తి ):

కొన్ని వారాలుగా ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న గ్యాస్ కొరత సమస్యకు తెరపడనుంది. పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతల కారణంగా నిలిచిపోయిన గ్యాస్ సరఫరా మళ్ళీ పుంజుకుంది. వ్యూహాత్మకమైన హర్మూజ్ జలసంధినిదాటుకుని సుమారు 46 వేల మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీ ని లోడ్ చేసుకున్న భారీ భారతీయ నౌక విశాఖపట్నం వైపు దూసుకువస్తోంది. ఈ భారీ ఎల్‌పీజీ నౌక మే 13వ తేదీన విశాఖపట్నం నౌకాశ్రయానికి చేరుకోనుంది. ఇందులో ఉన్న 46 వేల మెట్రిక్ టన్నుల గ్యాస్ సుమారు 32 లక్షల గృహ సిలిండర్లను నింపడానికి సరిపోతుందని అంచనా. ఈ నౌక రాకతో రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా ఉత్తరాంధ్ర మరియు కోస్తా జిల్లాల్లో ఉన్న గ్యాస్ సిలిండర్ల వెయిటింగ్ పీరియడ్ గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. నౌక విశాఖ చేరుకున్న వెంటనే, గ్యాస్‌ను పైప్‌లైన్ల ద్వారా విశాఖలోని ప్రతిష్టాత్మక 'భూగర్భ గ్యాస్ నిల్వ కేంద్రానికి' తరలిస్తారు. సముద్ర మట్టానికి సుమారు 190 మీటర్ల లోతులో ఉన్న ఈ కేంద్రం నుండి గ్యాస్‌ను హిందుస్తాన్ పెట్రోలియం , ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ వంటి బాట్లింగ్ ప్లాంట్లకు పంపిస్తారు. అక్కడ సిలిండర్లలో నింపి వినియోగదారులకు పంపిణీ చేస్తారు. హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయంగా గ్యాస్ ధరలు పెరగడంతో ఏపీలో కూడా సిలిండర్ల లభ్యత కష్టమైంది. ఇప్పుడు సరఫరా మెరుగుపడటంతో మార్కెట్‌లో గ్యాస్ కొరత తీరడమే కాకుండా, సాధారణ ప్రజలకు ఊరట లభించనుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ పంపిణీ వ్యవస్థను పర్యవేక్షిస్తూ, అక్రమ నిల్వలు ఉండకుండా చర్యలు చేపట్టింది. విశాఖ బాట్లింగ్ ప్లాంట్ నుండి ఆంధ్రప్రదేశ్‌లోని సుమారు 5 జిల్లాలకు మరియు ఇతర ప్రాంతాలకు గ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తారు. విశాఖపట్నంలో ప్రపంచంలోనే అత్యంత లోతైన మరియు భారతదేశంలోనే మొదటిదైన భూగర్భ ఎల్‌పీజీ స్టోరేజ్ క్యావెర్న్ ఉన్న సంగతి తెలిసిందే.

# పేపర్ మిల్లు మూత శాశ్వతమేనా

రాజమండ్రి, ,మే 4 (భారత శక్తి ):

తూర్పుగోదావరి జిల్లా పారిశ్రామిక చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కడియం ఆంధ్ర పేపర్ మిల్లుకు ఇప్పుడు గడ్డుకాలం దాపురించింది. కొన్ని దశాబ్దాలుగా వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తూ, జిల్లా ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించిన ఈ మిల్లును యాజమాన్యం అకస్మాత్తుగా 'లాకౌట్' చేస్తున్నట్లు ప్రకటించింది. శాశ్వత ఉద్యోగులెవరూ మిల్లుకు రావద్దంటూ యాజమాన్యం ఫోన్లకు సందేశాలు పంపడంతో కార్మికులు షాక్‌కు గురయ్యారు. గత కొంతకాలంగా తమ సమస్యలను పరిష్కరించాలని, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ మిల్లు కార్మికులు శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్నారుఈ క్రమంలో కార్మికులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాల్సింది పోయి, యాజమాన్యం ఏకపక్షంగా లాకౌట్ ప్రకటించడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. మిల్లు గేట్లకు నోటీసులు అంటించడంతో పాటు, మిల్లులోకి ఎవరినీ అనుమతించకపోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ అకస్మాత్తు నిర్ణయం వల్ల కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది. ఆంధ్ర పేపర్ మిల్లు కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదు, కడియం మరియు చుట్టుపక్కల ప్రాంతాలకు ఒక ఆర్థిక భరోసా. ఇక్కడ పని చేస్తున్న ప్రత్యక్ష మరియు పరోక్ష కార్మికులపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.

## కల్తీ నెయ్యి వ్యవహారంలో
# ధర్మారెడ్డికి బిగిస్తున్న ఉచ్చు

తిరుపతి, ,మే 4 (భారత శక్తి ):

ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది హిందువుల ఆరాధ్య దైవం, తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం పవిత్రతను దెబ్బతీసిన కల్తీ నెయ్యి వ్యవహారంలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ భారీ కుంభకోణానికి టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి ప్రధాన కారకుడని ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ తేల్చి చెప్పింది. తాజాగా మీడియాకు అందుతున్న సమాచారం ప్రకారం, శ్రీవారి నెయ్యి టెండరు నిబంధనలను నిబంధనలకు విరుద్ధంగా సడలించడంలో ధర్మారెడ్డి కీలక పాత్ర పోషించారని కమిషన్ నిర్ధారించింది. సాధారణంగా టీటీడీకి సరఫరా చేసే నెయ్యి విషయంలో అత్యంత కఠినమైన నిబంధనలు ఉంటాయి. అయితే, ధర్మారెడ్డి హయాంలో ఈ నిబంధనలను సడలించడం ద్వారా నాణ్యత లేని, కల్తీ నెయ్యిని సరఫరా చేసే సంస్థలకు టీటీడీలోకి మార్గం సులభమైందని నివేదిక పేర్కొంది. అప్పట్లోనే నాణ్యతపై ఫిర్యాదులు వచ్చినా, సదరు సంస్థలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి చర్యలు తీసుకోకుండా.. వాటినే కొనసాగించేలా నిర్ణయాలు తీసుకోవడం వెనుక ధర్మారెడ్డి ప్రమేయం ఉందని కమిషన్ వెల్లడించింది. దీనివల్ల భక్తుల సెంటిమెంట్‌తో ఆడుకోవడమే కాకుండా, ప్రసాదం నాణ్యతను దారుణంగా దిగజార్చారని కమిషన్ ఆక్షేపించింది. ఈ కల్తీ నెయ్యి కుంభకోణంలో ధర్మారెడ్డిపై కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఏకసభ్య కమిషన్ ప్రభుత్వానికి నివేదించింది. అంతేకాకుండా, ఈ వ్యవహారంలో అప్పటి ఈవో సింఘాల్ మరియు ఆర్థిక సలహాదారు బాలాజీల ప్రమేయంపై కూడా ప్రస్తావించడం గమనార్హం. నిబంధనల సడలింపు, ఆర్థిక లావాదేవీలు మరియు టెండర్ల ఖరారులో వీరి పాత్రపై కూడా విచారణ జరగాల్సిన అవసరం ఉందని నివేదికలో పేర్కొన్నారు. భక్తుల నమ్మకాన్ని వమ్ము చేసిన అధికారులపై ఇప్పుడు ప్రభుత్వం ఎలాంటి కఠిన చర్యలు తీసుకుంటుందో అన్నది వేచి చూడాలి.

# పల్నాడు జిల్లాలో దోపిడీ గ్యాంగ్ అరెస్ట్
## 566 గ్రాముల బంగారం రికవరీ

పల్నాడు జిల్లా కారంపూడి మండలంలో సంచలనం రేపిన దోపిడీ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. దోపిడీలకు పాల్పడుతున్న గ్యాంగ్‌ను అరెస్టు చేసి, భారీ మొత్తంలో బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గురజాల డిఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో జిల్లా ఎస్పీ కృష్ణారావు వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ, సులభంగా డబ్బు సంపాదించాలని భావించిన ఈ గ్యాంగ్ బంగారు ఆభరణాలు తీసుకువెళ్లే వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా బంగారు షాపులకు ఆర్డర్లపై ఆభరణాలు సరఫరా చేసే వారిని టార్గెట్ చేసి 566 గ్రాముల బంగారం దోచుకున్నారని చెప్పారు. ఈ కేసులో మొత్తం ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

# తెలుగు వారికి టిపిక్స్ క్లబ్

విజయవాడ, ,మే 4 (భారత శక్తి ):

విదేశాంధ్రుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎపిఎనఆర్టిఎస్ సంస్థకు మరోసారి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రవి వేమూరు విదేశాంధ్రుల కోసం మరింతగా సేవలందించే విధంగా కొన్ని కార్యక్రమాలను చేపట్టారు. అందులో ౧తిజూవలీ.ఇ॰శ్రీబీఎ కూడా ఒకటి. ముఖ్యమంత్రి చంద్రబాబు విదేశాల్లో ఉన్నప్పుడు ఎన్నారైలను ఉద్దేశించి ప్రతి ఒక్కరూ ఎంట్రప్రెనూరర్‌లుగా తయారై ఇతరులకు ఉపాధిని కల్పించేలా తయారు కావాలని పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దానిని దృష్టిలో పెట్టుకునే రవి వేమూరు ఈ టింపెక్స్ క్లబ్‌ను రూపొందించారు. ఈ టింపెక్స్‌తో ఉద్యోగులతోపాటు, ఇంట్లో ఉన్న గృహిణులు కూడా ట్రేడింగ్ నిర్వహించవచ్చని చెప్పారు. ఈ టింపెక్స్‌కు సంబంధించి ఆయన చెప్పిన వివరాలను ఇక్కడ ఇస్తున్నాము.మన దేశంలో గానీ, విదేశాల్లో గానీ వ్యాపారం చేయడంలో ముందుండేవాళ్ళు గుజరాతీలు, తమిళులు. అంతర్జాతీయ వాణిజ్యంలో బలమైన నెట్ వర్క్ లను వారు కలిగి ఉన్నారు. విభిన్న పద్ధతుల్లో మంచి ఆదాయ మార్గాలను అన్వేషించుకొని, వ్యాపారవేత్తలు గా వారు రాణిస్తున్నారు. ఇదే విధంగా రాష్ట్రంలోని తెలుగువాళ్ళతోపాటు, విదేశాల్లో ఉన్న తెలుగువాళ్ళకు కూడా ట్రేడింగ్ చేసుకునే సదుపాయాన్ని కల్పిస్తే వారు మరింతగా రాణించి గ్లోబల్ ఎంట్రప్రెన్యూరర్ గా తయారవుతారన్న ఉద్దేశ్యంతో ఏపీఎన్ఆర్టీఎస్ ఈ టింపెక్స్ క్లబ్‌ను రూపొందించింది.ప్రస్తుతం ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్, లిబరైలైజేషన్ (ఎల్‌పిజి) అయిన తర్వాత ఎవరైనా, ఎక్కడైనా వ్యాపారాలు చేసుకోవచ్చు. దానికి అనేక మార్గాలున్నాయి. మన రాష్ట్రంలో, మన దేశంలో ఇంకా చెప్పాలంటే మన ఇంట్లోనే వుంటూ మనం తయారు చేసే వస్తువులను ఇతర దేశాలకు ఎగుమతులు చేయవచ్చు. చిన్న చిన్న వస్తువులే కాదు.. పెద్ద పెద్ద వస్తువులను కూడా ఎగుమతి చేసి, డబ్బు సంపాదించవచ్చు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో రొయ్యలు, గుంటూరు మిర్చి పండించే రైతులు ఈ విధంగా చేస్తున్నారు. ఇతర దేశాలకు తమ ఉత్పత్తులను పంపుతున్నారు. లాభాలను ఆర్జిస్తు న్నారు. అయితే.. కేవలం కొన్ని వస్తువులే కాకుండా.. మరిన్ని వస్తువులను కూడా ఇతర దేశాలకు ఎగుమతి చేయడానికి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మంచి అవకాశం దొరికింది. ఈ అవకాశాన్ని ఏపీఎన్ఆర్టీఎస్(ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ) కల్పిస్తోంది. ౧ఎఖఇచీ.ఇ॰శ్రీబీఎ ద్వారా మన రాష్ట్రంలోనే వుంటూ గుజరాతీల లాగా, తమిళుల లాగా మనం కూడా బలమైన అంతర్జాతీయ వ్యాపారవేత్తలుగా ఎదిగే అవకాశం పుష్కలంగా వుంది. ఆసక్తి వున్న వారికి, వ్యాపారవేత్తలుగా ఎదగాలని బలమైన వాంఛ వున్న వారికి అంతర్జాతీయ వాణిజ్యంపై శిక్షణ, అవకాశాలను ఎలా పొందాలి.. గైడెడ్ ట్రేడింగ్ గురించి సంపూర్ణమైన శిక్షణ ఇచ్చేందుకు ఈ సంస్థ రెడీగా వుంది.ఏపీలో వుండే వారికి ఎంతటి ప్రాధాన్యత వుందో విదేశాంధ్రులకు కూడా అంతే ప్రాధాన్యతను ఇస్తూ.. వారి సంక్షేమం, అభివృద్ధి, వ్యాపార సాధికారత పట్ల కూడా కట్టుబడి వుంది. కేవలం పెద్ద పెద్ద వ్యాపారవేత్తలే కాకుండా సరైన అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వ సహాయ సహకారాలతో చిన్న చిన్న వ్యాపారులు, రైతులు, యువకులు, మహిళలు కూడా అంతర్జాతీయ విపణిలో నిలదొక్కుకునే అవకాశాలను కల్పిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వున్న తెలుగు వారిని నంబర్ వన్ గ్లోబల్ కమ్యూనిటీ లీడర్లుగా తీర్చి దిద్దాలని ఏపీ ప్రభుత్వం కూడా సంకల్పించింది. ఉద్యోగిత నుంచి వ్యాపారం వైపు ప్రజలను మార్చాలని నిర్ణయించు కుంది. అయితే తయారీ రంగాలు, పెద్ద వ్యాపారాలతో పోలిస్తే 'ట్రేడింగ'కి భారీ పెట్టుబడి లేదా ప్రత్యేక మౌలిక వసతులు అవసరమే లేదు. పార్ట్ టైమ్‌గా కూడా నిర్వహించ వచ్చు అని సంస్థ వారు చెబుతున్నారు. అయితే.. ఇందులో ఒప్పందాలు చేసుకునే విధానాలు, అందులో ప్రామాణికత, స్థిరమైన విధానాల ద్వారా సరైన దిశలో సాగేలా మనకు అవకాశాలు, అవగాహన కల్పిస్తారు. ట్రేడింగ్ ప్రారంభంలో వున్న వారు ఇబ్బందులు పడకుండా, వుండేందుకే సహాయ పడుతుంది. గృహిణులు, వారి కుటుంబీకులు కూడా కలిసి సంయుక్తంగా ఏదైనా వ్యాపారాన్ని చేసుకోవచ్చు. తెలుగు ట్రేడర్లు అంతర్జాతీయంగా ఇప్పటికే పాతుకుపోయిన ట్రేడ్ నెట్‌వర్క్‌లతో పోటీ పడాలంటే ఖర్చు కావాలి, అనుభవం కావాలి. ఈ రెంటితో పాటు మరిన్ని మెళకువలను కూడా ౧ఎఖఇచీ.ఇ॰శ్రీబీఎ అందిస్తుంది. అయితే తక్షణంగా వచ్చే లాభాల కంటే పెట్టుబడుల పైనే ఇది ఎక్కువ దృష్టి సారిస్తుంది. పెట్టుబడి భద్రతకు కూడా ప్రాధాన్యతను ఇస్తుంది. తయారీ రంగం లేదా పెద్ద వ్యాపారాలతో పోలిస్తే, ట్రేడింగుకు భారీ పెట్టుబడి లేదా ప్రత్యేక మౌలిక వసతులు అవసరం లేదు. పార్ట్ టైమ్ ద్వారా కూడా నిర్వహించొచ్చు. ఉత్పత్తుల అభివృద్ధి కంటే వేగంగా లాభాలు వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే ప్రామాణిక ఒప్పందాలు, స్థిరమైన విధానాల ద్వారా ప్రమాదాలను కూడా తగ్గించొచ్చు. ప్రారంభ దశలో అత్యంత నిపుణత అవసరం లేకపోవడం వల్ల కొత్తగా వ్యాపారంలోకి వచ్చే వారికి ఇది అనుకూల మార్గమని అంటోంది. స్థిర ఆదాయం, అంతర్జాతీయ అనుభవం, విదేశీ మార్కెట్లకు ప్రత్యక్ష పరిచయం ఉన్న ప్రవాసాంధ్రులకు ఇది సహజమైన తదుపరి అడుగు. ఏపీఎన్ఆర్టీఎస్ కార్యక్రమాల ద్వారా తెలియజేసినట్లుగా, నెలలో కొన్ని రోజుల సమయంతో కూడా ఈ వ్యాపారాన్ని నిర్వహించొచ్చు. గృహిణులు, కుటుంబ సభ్యులు కలిసి ఒక సంయుక్త వ్యాపార ప్రయాణాన్ని ప్రారంభించడానికి కూడా ఇది అనువైన అవకాశం అని తెలియజేస్తోంది.

# ఏపీలో మూడో ఫ్రంట్ సాధ్యమేనా

నెల్లూరు, ,మే 4 (భారత శక్తి ):

ఏపీలో కొత్త పార్టీ రాబోతోందా. అది కూడా ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సీనియర్ పోలీస్ అధికారి పీవీ సునీల్ కుమార్ నాయకత్వంలో వస్తోందా. అసలు ఏపీ రాజకీయాల్లో కొత్త పార్టీ ఏర్పాటు చేయాల్సిన అనివార్యత ఉందా. అందుకు రాజకీయ వాతావరణం కలసి వస్తుందా ఇవన్నీ ప్రశ్నలు. వీటికి జవాబు పీవీ సునీల్ కుమార్ ఇంటర్వ్యూలో పూర్తి క్లారిటీతో ఇచ్చారు. ఏపీలో తాను కొత్త పార్టీ చేస్తానా లేదా అన్నది భవిష్యత్తు నిర్ణయిస్తుంది అని ఆయన చెప్పడం విశేషం. తాను రాజకీయ పార్టీ ఏర్పాటు చేయను అని ఆయన ఎక్కడా చెప్పలేదు. అదే సమయంలో రాజకీయ పార్టీ ఏర్పాటు అవసరం ఉందనే అంటున్నారు. దళితుల హితం తన అజెండా అని ఆయన చెప్పారు. దళితుల ఉద్ధరణ కోసం వారికి రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా సముచితమైన స్థానం కోసం కొత్త రాజకీయం అవసరం అని ఆయన అభిప్రాయపడ్డారు. అదే సమయంలో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నుంచి దళితులు ఓటు వేసే వారుగానే ఉండిపోయారు తప్ప రాజ్యాంగబద్ధమైన పదవులు అందుకోలేకపోయారు అని ఆయన అన్నారు. ఈ రాష్ట్రంలో ఎవరికి ఓటు వేసినా దళితుల స్థితిగతులు మారలేదని ఆయన చెప్పుకొచ్చారు. పదహారు శాతం పైగా ఓటు షేర్ కలిగిన దళితులకు రాజకీయ అధికారం తప్పనిసరిగా కావాల్సి ఉందని సునీల్ కుమార్ నొక్కి చెప్పారు. తాను ప్రధాన రాజకీయ పార్టీలలో చేరి వాళ్ళ నుంచి బీఫారం తీసుకుని బానిసగా మాత్రం బతకను అని ఆయన స్పష్టం చేశారు. అదే సమయంలో కొత్త రాజకీయ పార్టీ అవసరం ఉందని అన్నారు. రాజకీయాలు డైనమిక్ అని ఎపుడు ఏమి జరుగుతుందో తెలియదు అన్నారు కాబట్టి తాను పార్టీ పెడతానా లేదా అన్నది వేచి చూడాలని అన్నారు. తాను రాజకీయ పార్టీ పెట్టడం వల్ల ఎవరికి నష్టం లాభం అన్నది తనకు అనవసరం అని సునీల్ కుమార్ చెప్పారు. దళితులు బాగుపడడమే తన లక్ష్యమని అదే తన టార్గెట్ అని కూడా నొక్కి చెప్పారు. ఏపీ రాజకీయాల్లో సామాజిక రాజకీయ మార్పు రావాల్సి ఉందని సునీల్ కుమార్ అన్నారు. రాష్ట్రంలో కాపులు పెద్ద సంఖ్యలో ఉన్నారని వారి తరువాతా అత్యధిక సంఖ్యలో దళితులు ఉన్నారని ఆయన చెప్పారు. ఈ రెండు సామాజిక వర్గాలు కలిస్తే కనుక యాభై శాతం కంటే ఎక్కువ ఓటు బ్యాంక్ తమది అవుతుందని అన్నారు. ఆ దిశగా ప్రయత్నాలు అయితే సాగుతున్నాయని అన్నారు. అది తనతోనే కాదని 2005 నుంచి ఈ ఆలోచనలు ఉన్నాయని సునీల్ కుమార్ చెప్పడం విశేషం. సరైన సమయం వస్తే కచ్చితంగా ఈ ప్రయత్నాలు సఫలీకృతం అవుతాయని కూడా ఆయన ఆశాభావం గా చెప్పారు. మాల మాదిగల మధ్యన కూడా విభేదాలు లేవని ఇపుడు అంతా ఒక్కటిగానే ముందుకు వస్తున్నారని ఆయన చెప్పారు రాష్ట్రంలో కాపులకు దళితులకు మధ్య సామరస్య వాతావరణమే ఉందని సునీల్ కుమార్ చెప్పారు. ఒక చుండూరు ఒక కారంచేడు లాంటి ఘటనలు అయితే ఎక్కడ కాపులు చేయలేదని అన్నారు. చిన్న పాటి గొడవలు మాత్రమే ఉన్నాయని అవన్నీ పట్టించుకోవాల్సింది లేదని అన్నారు. ఏపీలో కాపులకు ఐకాన్ గా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఉన్నారని యాంకర్ గుర్తు చేసినపుడు సమయం వచ్చినపుడు ఎవరిని కలవాలో అందరినీ కలుస్తామని సునీల్ కుమార్ బదులిచ్చారు. దీనిని బట్టి చూస్తే ఫ్యూచర్ లో కాపులు ప్లస్ దళితులతో కొత్త పార్టీ రావచ్చు అన్న చర్చ అయితే సాగుతోంది.

# జనాగ్రహసభ పేరుకు పీఎంవో ఆక్షేపణ

హైదరాబాద్, ,మే 4 (భారత శక్తి ):

దేశ ప్రధానిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత నరేంద్ర మోదీ తొలిసారిగా తెలంగాణ గడ్డపై అడుగుపెడుతున్నారు. ఈ నెల 10న జరగనున్న ఈ పర్యటన ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఒకవైపు కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు.. మరోవైపు రాజకీయ వ్యూహప్రతివ్యూహాల మధ్య ఈ పర్యటన సాగుతోంది. అయితే, పర్యటనకు ముందే చోటుచేసుకున్న ఒక అనూహ్య పరిణామం రాష్ట్ర బీజేపీని ఇరకాటంలో పడేసింది.మే 10వ తేదీన హైదరాబాద్ చేరుకోనున్న ప్రధాని మోదీ, రాష్ట్ర రాజధానితో పాటు పరిసర ప్రాంతాలకు సంబంధించిన పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నారు. రైల్వే లైన్ల విస్తరణ, జాతీయ రహదారుల నిర్మాణం, మరికొన్ని మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులను ఆయన ప్రారంభించనున్నారు. ప్రధాని హోదాలో వస్తున్న మోదీ పర్యటనను అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు బీజేపీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నాయి. ముఖ్యంగా మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తెలంగాణకు వస్తుండటంతో, ఈ పర్యటన ద్వారా రాష్ట్రంపై కేంద్రానికి ఉన్న చిత్తశుద్ధిని చాటిచెప్పాలని బీజేపీ నేతలు భావించారు.రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ లక్ష్యంగా ఈ పర్యటనను భారీ రాజకీయ వేదికగా మార్చుకోవాలని రాష్ట్ర బీజేపీ శాఖ వ్యూహం రచించింది. ఇందులో భాగంగా ప్రధాని పాల్గొనే బహిరంగ సభకు 'ప్రజాగ్రహ సభ' అని నామకరణం చేసింది. గత ప్రభుత్వాల వైఫల్యాలను, ప్రస్తుత ప్రభుత్వ లోపాలను ఎండగట్టడమే లక్ష్యంగా ఈ పేరును ఖరారు చేశారు. అయితే, ఈ పేరుపై ప్రధానమంత్రి కార్యాలయం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అభివృద్ధి కార్యక్రమాలకు వస్తున్న ప్రధాని పాల్గొనే సభకు రాజకీయ సభలలాగా 'ప్రజాగ్రహ సభ' అనే పేరు పెట్టడం సముచితం కాదని పీఎంఓ స్పష్టం చేసింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలతో ముడిపడి ఉన్న పర్యటనలో ఇటువంటి పేర్లు ప్రోటోకాల్ కు, సందర్భానికి విరుద్ధమని సూచించడంతో రాష్ట్ర బీజేపీ నేతలు ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు. పీఎంఓ ఆదేశాలతో చేసేదేమీ లేక 'ప్రజాగ్రహ సభ' అనే పేరును తక్షణమే ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు.పేరు మార్చినప్పటికీ, ప్రధాని మోదీ పర్యటన రాజకీయ ఉద్దేశం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో బలపడుతున్న కాంగ్రెస్ కు అడ్డుకట్ట వేయడం, అదే సమయంలో కేడర్ లో నూతనోత్సాహాన్ని నింపడం మోదీ ప్రసంగం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. తెలంగాణ బీజేపీ నేతలు చెప్తున్న దాని ప్రకారం.. మోదీ తన ప్రసంగంలో రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం ఇస్తున్న నిధులను వివరిస్తూనే, స్థానిక రాజకీయ పరిస్థితులపై తనదైన శైలిలో విమర్శలు చేసే అవకాశం ఉంది. ప్రధాని పర్యటనను విజయవంతం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా భారీగా జన సమీకరణ చేసే పనిలో రాష్ట్ర బీజేపీ నాయకత్వం నిమగ్నమైంది.మొత్తానికి ప్రధాని మోదీ మే 10 పర్యటన అభివృద్ధి, రాజకీయాల కలయికగా సాగనుంది. సభ పేరు మార్పు వ్యవహారం కొంత చర్చకు దారితీసినప్పటికీ, ప్రధాని ఇచ్చే సందేశం తెలంగాణ భవిష్యత్తు రాజకీయాలపై ఎటువంటి ప్రభావం చూపుతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# మద్యం ధరలకు రెక్కలు

హైదరాబాద్,,మే 4 (భారత శక్తి ):




తెలంగాణలో మద్యం ధరలు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు మద్యం ధరలు చివరిసారిగా 2023 మే నెలలో పెంచారు. ఆ తరువాత ఏడాదికిపైగా మద్యం ధరలు స్థిరంగా ఉండటంతో ప్రస్తుతం మరోసారి పెంపునకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మద్యం ధరల పెంపుపై ప్రభుత్వం నియమించిన కమిటీ డిస్టిలరీల ప్రతిపాదనలను పరిశీలిస్తోంది. ఈ కమిటీలో ఆర్థిక, ఆమోదం, పరిశ్రమ శాఖల అధికారులు ఉన్నారు. ధరల పెంపునకు కారణాలు నివేదించనున్నారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులు, పన్నులు, రవాణా ఖర్చులు అధికమవడంతో ధరలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఏ బ్రాండ్ పై ఎంత ధర ఉండనుంది అంటేమద్యం ధరలు గత రెండేళ్లుగా స్థిరంగా కొనసాగాయి. దీంతో డిస్టిలరీలు నష్టాలు చవిచూస్తున్నాయని తెలుపుతున్నారు. దీంతో వారి ప్రతిపాదనను రాష్ట్రప్రభుత్వం నియమించిన కమిటీకి నివేదించారు. దీనిపై కమిటీ పరిశీలిస్తోంది. ఇందులో భాగంగా సాధారణ బ్రాండ్ ఫుల్ బాటిల్‌పై రూ.60, ప్రీమియం బ్రాండ్‌లపై రూ.100, హయ్యర్ కేటగిరీ బ్రాండ్‌లపై రూ.120 పెంపు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే డిస్టిలరీల నుంచి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగానే పెంపు ఉంటుందని సమాచారం. రెండేళ్లకోసారి జరిగే ధరల సవరణ ఈసారి ఆలస్యం అయ్యింది. కాబట్టి రెండు రోజుల్లోనే అధికారిక ప్రకటన వచ్చే సూచనలు ఉన్నాయి.ఈ ధరల పెంపు ప్రజల జీవితంపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. మద్యంపై ఆసక్తి ఉన్నవారికి ఖర్చు ఎక్కువవుతుంది. అయితే ప్రభుత్వం దీని ద్వారా ఆదాయం పెంచుకోవాలని భావిస్తోంది. గతంలో కూడా ఇలాంటి పెంపులు జరిగాయి. ఈసారి పెంపు మేర తక్కువగా ఉంటే కూడా ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది.అధికారిక ప్రకటన తర్వాత బార్లు, వైన్సులల్లో కొత్త ధరలు అమలవుతాయి. డిస్ట్రిక్ట్‌ల వారీగా మార్కెటింగ్ విభాగం పరిశీలిస్తుంది. ప్రస్తుతం ఈ విషయంపై రాజకీయ చర్చలు జరుగుతున్నాయి. ప్రతిపక్షాలు దీన్ని విమర్శిస్తున్నాయి. మద్యం ధరల పెంపు రాష్ట్ర ఆర్థికాలకు ఎలా దోహదపడుతుందో చూడాలి.ఇదిలా ఉండగా ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో గణనీయంగా పెరిగాయి. ప్రభుత్వం బీర్ల గరిష్ఠ చిల్లర ధర (ఓఖీఖ)పై సుమారు 15 శాతం పెంపు జారీ చేసింది. దీంతో లైట్ బీర్ దాదాపు రూ.150 నుంచి సుమారు రూ. 180కి పెరిగింది. స్ట్రాంగ్ బీర్ రూ.160 నుంచి దాదాపు రూ.190కి పెరిగింది. మరికొన్ని ప్రీమియం బ్రాండ్లలో ఒక్కో బీర్‌పై సగటున రూ.30 నుంచి 40 వరకు పెంచారు. అయితే మద్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో బీర్ల ధరలు పెరుగుతాయా..? చూడాలి.

# గేమ్ ఛేంజర్ కానున్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్

వరంగల్, ,మే 4 (భారత శక్తి ):

తెలంగాణ పారిశ్రామిక ముఖచిత్రంలో వరంగల్ జిల్లా మరో చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కాబోతోంది. గీసుకొండ, సంగెం మండలాల పరిధిలో 1,327 ఎకరాల్లో విస్తరించిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వ 'పీఎం మిత్ర' పథకం కింద బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన ఈ పార్క్‌ను, ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఇది కేవలం ఒక పారిశ్రామిక ప్రాజెక్ట్ మాత్రమే కాదు, ఉత్తర తెలంగాణ ఆర్థిక గమనాన్ని మార్చే ఒక గేమ్ ఛేంజర్.కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '5ఎఫ్' విజన్ (ఫార్మ్, ఫార్మ్ టు ఫైబర్, ఫైబర్ టు ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ టు ఫ్యాషన్, ఫ్యాషన్ టు ఫారిన్) కాన్సెప్ట్‌తో ఈ పార్క్ రూపుదిద్దుకుంది. అంటే పత్తి సాగు చేసే రైతు నుంచి, విదేశీ వీధుల్లో ఫ్యాషన్ దుస్తుల ప్రదర్శన వరకు ఒకే గొడుగు కింద కార్యకలాపాలు సాగుతాయి. ఇందుకోసం కేంద్రం మొదటి దశలో 200 కోట్లు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గడిచిన రెండేళ్లలో పనులు శరవేగంగా పూర్తయ్యాయి.మొత్తం 1,695 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో అభివృద్ధి చెందిన ఈ పార్క్‌లో అత్యాధునిక మౌలిక సదుపాయాలు కల్పించారు. పరిశ్రమల కోసం ప్రత్యేకంగా 232/132/33 కేవీ పవర్ సబ్ స్టేషన్లు, 220 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్లు ఏర్పాటు చేశారు. రోజుకు 12 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేసే వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. పారిశ్రామిక వ్యర్థాలను శుద్ధి చేసేందుకు 5 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన 'సీఈటీపీ జీరో లిక్విడ్ డిశ్చార్జ్' ప్లాంట్ ట్రయల్ రన్‌లో ఉంది.ఒకప్పుడు పనుల జాప్యంతో నిరాశ చెందిన స్థానిక యువతకు, రైతులకు ఈ పార్క్ ఇప్పుడు ఆశాదీపంలా మారింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 24,400 మందికి నేరుగా ఉపాధి లభించనుంది. ఇప్పటికే 2 వేల మంది విధుల్లో ఉండగా, రానున్న రోజుల్లో శిక్షణ పొందిన వేలాది మందికి అవకాశాలు దక్కనున్నాయి. ఇప్పటికే గణేశా ఎకో, యంగ్ వన్ వంటి కంపెనీలు ఉత్పత్తి ప్రారంభించాయి. ప్రముఖ బ్రాండెడ్ కంపెనీ 'కైటెక్స్' కూడా ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇప్పటివరకు 3842 కోట్ల పెట్టుబడులు రాగా, భవిష్యత్తులో ఇది 6వేల కోట్లకు చేరుతుందని అంచనా.2017లో శంకుస్థాపన జరిగినప్పటి నుంచి ఎన్నో ఆటంకాలను దాటుకుని నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఓరుగల్లు గడ్డపై అంతర్జాతీయ స్థాయి టెక్స్‌టైల్ హబ్ సాకారమైంది. పార్క్‌లోని 62 శాతం భూములు ఇప్పటికే ఇండస్ట్రీలకు కేటాయించడమే దీనికున్న డిమాండ్‌కు నిదర్శనం. పత్తి పండించే రైతుకు గిట్టుబాటు ధర, స్థానిక యువతకు ఉద్యోగం, విదేశీ మారక ద్రవ్యాన్ని తెచ్చే ఎగుమతులు.. ఇలా అన్ని కోణాల్లోనూ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ తెలంగాణ ప్రగతి చక్రంలో కీలక మైలురాయిగా నిలవబోతోందితెలంగాణ పారిశ్రామిక ముఖచిత్రంలో వరంగల్ జిల్లా మరో చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కాబోతోంది. గీసుకొండ, సంగెం మండలాల పరిధిలో 1,327 ఎకరాల్లో విస్తరించిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వ 'పీఎం మిత్ర' పథకం కింద బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన ఈ పార్క్‌ను, ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఇది కేవలం ఒక పారిశ్రామిక ప్రాజెక్ట్ మాత్రమే కాదు, ఉత్తర తెలంగాణ ఆర్థిక గమనాన్ని మార్చే ఒక గేమ్ ఛేంజర్.కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '5ఎఫ్' విజన్ (ఫార్మ్, ఫార్మ్ టు ఫైబర్, ఫైబర్ టు ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ టు ఫ్యాషన్, ఫ్యాషన్ టు ఫారిన్) కాన్సెప్ట్‌తో ఈ పార్క్ రూపుదిద్దుకుంది. అంటే పత్తి సాగు చేసే రైతు నుంచి, విదేశీ వీధుల్లో ఫ్యాషన్ దుస్తుల ప్రదర్శన వరకు ఒకే గొడుగు కింద కార్యకలాపాలు సాగుతాయి. ఇందుకోసం కేంద్రం మొదటి దశలో 200 కోట్లు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గడిచిన రెండేళ్లలో పనులు శరవేగంగా పూర్తయ్యాయి.మొత్తం 1,695 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో అభివృద్ధి చెందిన ఈ పార్క్‌లో అత్యాధునిక మౌలిక సదుపాయాలు కల్పించారు. పరిశ్రమల కోసం ప్రత్యేకంగా 232/132/33 కేవీ పవర్ సబ్ స్టేషన్లు, 220 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్లు ఏర్పాటు చేశారు. రోజుకు 12 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేసే వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. పారిశ్రామిక వ్యర్థాలను శుద్ధి చేసేందుకు 5 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన 'సీఈటీపీ జీరో లిక్విడ్ డిశ్చార్జ్' ప్లాంట్ ట్రయల్ రన్‌లో ఉంది.ఒకప్పుడు పనుల జాప్యంతో నిరాశ చెందిన స్థానిక యువతకు, రైతులకు ఈ పార్క్ ఇప్పుడు ఆశాదీపంలా మారింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 24,400 మందికి నేరుగా ఉపాధి లభించనుంది. ఇప్పటికే 2 వేల మంది విధుల్లో ఉండగా, రానున్న రోజుల్లో శిక్షణ పొందిన వేలాది మందికి అవకాశాలు దక్కనున్నాయి. ఇప్పటికే గణేశా ఎకో, యంగ్ వన్ వంటి కంపెనీలు ఉత్పత్తి ప్రారంభించాయి. ప్రముఖ బ్రాండెడ్ కంపెనీ 'కైటెక్స్' కూడా ప్రారంభానికి సిద్ధంగా ఉంది.

## కామారెడ్డి బస్టాండ్లో భారీ అగ్నిప్రమాదం.. 12 షాపులు దగ్ధం

కామారెడ్డి ,మే 4 (భారత శక్తి ):

: కామారెడ్డిలోని పాత బస్టాండ్ వద్ద ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో బస్టాండ్ వద్ద ఉన్న 12 షాపులు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## విద్యుత్ సబ్ స్టేషన్ లో అగ్ని ప్రమాదం

నల్గొండ ,మే 4 (భారత శక్తి ):

మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం సబ్ స్టేషన్ లో అగ్ని ప్రమాదం జరిగింది. అధిక ఉష్ణోగ్రత పెరగడం తో ఓవర్ హీట్ వలన సబ్ స్టేషన్ లోని ట్రాన్స్ ఫార్మర్ ఇన్సులేటర్లు పేలి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఫైర్ ఇంజన్ సాయంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసారు. .

## కుప్పకూలిన భవనం.. ఒకరు మృతి

విశాఖ ,మే 4 (భారత శక్తి ):

విశాఖ గాజువాక వికాస్ నగర్ లో భవనం కుప్పకూలింది. జాక్స్ సహాయంతో ఇంటిని పైకి లేపే సమయంలో ఘటన జరిగింది. ఒక్కసారిగా కుప్పకూలడంతో ఒకరు మృతి చెందారు. మరో ఏడుగురికి గాయాలు అయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న న్యూ పోర్ట్ పీఎస్ పోలీసులు, రెస్క్యూ టీమ్స్ సహాయక చర్యలు చేపట్టారు.క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.

=====================

## వివాహిత దారుణ హత్య

పామర్రు,మే 4 (భారత శక్తి ):

పామర్రు పట్టణంలో చౌదరి పేట ప్రతాప్ జూనియర్ కాలేజీ వీధి లో వివాహిత హత్యకు గురయింది. అక్రమ సంబంధం నేపథ్యంలో హత్య జరిగి నట్టు సమాచారం. నందివాడ మండలానికి చెందిన వివాహిత తన బిడ్డలను భర్త దగ్గరే వదిలేసి గత కొంతకాలం నుంచి పామర్రు లోని చౌదరి పేట లోఓ ఇంటిని అద్దెకు తీస్కొని ఓ వ్యక్తి తో సహజీవనం సాగిస్తూనీది. ఈ నేపథ్యంలో ఆమె భర్త తో అతను సోదరులు సోమవారం వేకువ జామున కొట్టి హతమార్చినట్టు సమాచారం.

## టీటీడీకి రూ.10 లక్షలు విరాళం

,మే 4 (భారత శక్తి ):

భువనేశ్వర్‌కు చెందిన బల్భద్ర డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సోమవారం టీటీడీ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.10,01,000 విరాళంగా అందించింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

## ట్రయిల్ రన్ లో ఓపీ....

హైదరాబాద్, ,మే 4 (భారత శక్తి ):

మెడికల్ సైన్సెస్ లో అవుట్ పేషెంట్ సేవలు ప్రారంభం కానున్నాయి. నెల రోజుల పాటు ట్రయల్ రన్ (ప్రయోగాత్మక నిర్వహణ)లో భాగంగా ఈ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.ప్రయోగాత్మక దశలో భాగంగా ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఓపీ మరియు డయాగ్నోస్టిక్ (వ్యాధి నిర్ధారణ పరీక్షలు) సేవలు అందుబాటులో ఉంటాయి. ఈ సమయంలో వచ్చే రోగులకు వైద్య పరీక్షలతో పాటు అవసరమైన ప్రాథమిక పరీక్షలు కూడా అక్కడే నిర్వహిస్తారు. ఈ నెల రోజుల ట్రయల్ రన్ ద్వారా ఆసుపత్రి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను గుర్తించి, భవిష్యత్తులో పూర్తిస్థాయి సేవలను ఎలాంటి ఆటంకాలు లేకుండా అందించాలని అధికారులు భావిస్తున్నారు.సాధారణ ప్రభుత్వాసుపత్రులకు భిన్నంగా టిమ్స్ సనత్‌నగర్‌లో 22 రకాల వైద్య విభాగాలు కొలువుదీరాయి. ఇందులో ప్రధానంగా ఏం ఉన్నాయంటే..?కార్డియాలజీ (గుండె సంబంధిత)న్యూరాలజీ (నరాల సంబంధిత)నెఫ్రాలజీ (కిడ్నీ సంబంధిత)గ్యాస్ట్రో ఎంటరాలజీయూరాలజీజనరల్ మెడిసిన్ – జనరల్ సర్జరీఈ కీలక విభాగాలతో పాటు మరికొన్ని సూపర్ స్పెషాలిటీ విభాగాలు కూడా ఈ ట్రయల్ రన్‌లో భాగం కానున్నాయి. ఇప్పటికే ఆయా విభాగాలకు అవసరమైన నిపుణులైన వైద్యులను, పారా మెడికల్ సిబ్బందిని ప్రభుత్వం అక్కడ నియమించింది.రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించారు. రేపటి నుంచి ప్రారంభం కానున్న ఓపీ సేవల కోసం అన్ని ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని?. మందుల లభ్యత మరియు పరీక్షల నిర్వహణలో సమన్వయం ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.నగరంలోని నాలుగు దిక్కులా టిమ్స్ ఆసుపత్రులను నిర్మించాలనే లక్ష్యంలో భాగంగా సనత్‌నగర్ టిమ్స్ కీలక అడుగు వేసింది. ఈ ఆసుపత్రి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఉస్మానియా, నిమ్స్ వంటి ఆసుపత్రులపై ఒత్తిడి గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.

# మళ్లీ నిరాశేనా....

హైదరాబాద్, ,మే 4 (భారత శక్తి ):



తెలంగాణలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. మంత్రివర్గం నుంచి కొందరిని తొలగించే అవకాశం ఉండగా.. కొత్త వారికి సైతం కేబినెట్‌లో అవకాశం లభించనుంది.కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణ మంత్రివర్గ ప్రక్షాళన, విస్తరణపై ఫోకస్ చేయనుందని తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న ఖాళీల్లో మరో ఇద్దరు నేతల్ని రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకునేందుకు వీలుంది. ఇందులో ఒక స్థానాన్ని ఎస్టీ సామాజిక వర్గానికి కేటాయించే ఛాన్స్ ఉండటంతో రేసులో బాలూనాయక్, రామచంద్రునాయక్ వంటి నాయకులు ఉన్నారు. మంత్రి పదవి తమనే వరిస్తుందని దీమాగా ఉన్నారు. అయితే రామచంద్రునాయక్‌ను గత ఏడాది డిప్యూటీ స్పీకర్ పోస్టుకు ఖరారు చేసినప్పటికీ శాసనసభలో ఇంకా ఎంపిక ప్రక్రియ పూర్తి చేయలేదు. ఇక మరో మంత్రి పదవి బెర్త్ కోసం పలువురు నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలకే అధిష్ఠానం ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో సీనియర్ నేతలు, పార్టీ రాష్ట్ర ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ సూచించే వారి పేర్లను సైతం కాంగ్రెస్ అధిష్టానం పరిశీలించనుంది. కొందరు మంత్రుల వ్యవహారశైలిపై ప్రజల్లో అసంతృప్తి ఉన్నందున పార్టీకి సైతం డ్యామేజ్ జరగకూడదని వారిని మార్చాలని రేవంత్ సూచించే అవకాశాలున్నాయి.ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి తెలంగాణ క్యాబినెట్‌లో ప్రాతినిథ్యం లేదు. మరోవైపు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క, సీతక్క మంత్రులుగా ఉన్నారు. నిజామాబాద్ నుంచి సీనియర్ ఎమ్మెల్యే పి. సుదర్శన్‌రెడ్డి ప్రస్తుతం క్యాబినెట్ హోదాలో ప్రభుత్వ సలహాదారుగా ఉన్నారు. ఆయనను మంత్రిగా తీసుకుంటారా లేక ఇదే జిల్లాకు చెందిన పీసీసీ చీఫ్, రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు అయిన మహేశ్‌కుమార్ గౌడ్‌కు మంత్రి పదవి దక్కుతుందా అనేది ఆసక్తికరంగా మారింది. అయితే రేవంత్ మాత్రం మహేష్ గౌడ్‌ను పార్టీ పరంగానే ప్రయోజనం కోసం పీసీసీ అధ్యక్షుడిగానే కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి విజయం సాధించాలంటే మహేష్ గౌడ్ లాంటి నేత పార్టీ సారథిగా ఉండాలని రేవంత్ భావిస్తున్నారు.మంత్రి పదవి కోసం చాలా మంది రేసులో ఉన్నప్పటికీ ప్రత్యేకంగా వినిపించే పేరు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. మునుగోడు ఎమ్మెల్యే తనకు ఖచ్చితంగా అవకాశం లభిస్తుందని నమ్ముతున్నారు. అయితే ఆయన సోదరుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పటికే మంత్రిగా ఉండటం మైనస్ అవుతోంది. కుటుంబం నుంచి ఒకే మంత్రి పదవి ఇవ్వాలని, రెండు పదవులు ఇవ్వకూడదని కాంగ్రెస్ హైకమాండ్ అభ్యంతరం తెలుపుతోంది. రేవంత్ రెడ్డి అధిష్ఠానంతో మాట్లాడి ఒప్పించడం అంత ఈజీ కాదని వినిపిస్తోంది. వీరితో పాటు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు, మల్‌రెడ్డి రంగారెడ్డి, మదన్‌మోహన్ రావు, రామ్మోహన్ రెడ్డి కూడా మంత్రి పదవి రేసులో ఉన్నారు. ప్రేమ్ సాగర్ రావుకు క్యాబినెట్ హోదాలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. కానీ ఆయన ఇంకా బాధ్యతలు చేపట్టలేదు. మంత్రివర్గ విస్తరణతో పాటు కొన్ని కీలక శాఖల్లో మార్పులు జరగనున్నాయని తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డికి అదనపు భారంగా మారిన కీలకమైన హోం శాఖ బాధ్యతను ఒక సీనియర్ మంత్రికి అప్పగిస్తారని పార్టీలోనూ వినిపిస్తోంది. ఇప్పటికే విద్యాశాఖ మంత్రిగా రేవంత్ ఉన్నప్పటికీ.. టెన్త్, ఇంటర్ ఫలితాలు ప్రభుత్వ సలహాదారు కేశవరావు విడుదల చేశారని తెలిసిందే. కేరళ ఎన్నికల ఫలితాల తర్వాతే తెలంగాణ మంత్రివర్గ ప్రక్షాళనపై కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుంది. కనుక కేబినెట్ విస్తరణకు మరికొన్ని రోజులు వేచి చూడక తప్పదు.

## కూకట్ పల్లి, ప్రగతి నగర్‌లో సగం ఇళ్లు ఖాళీ...

హైదరాబాద్,,మే 4 (భారత శక్తి ):

హైదరాబాద్ మహానగరంలో రియల్ ఎస్టేట్ దూకుడు బ్రేకుల్లేని బండిలా దూసుకుపోతూంటే, కూకట్ పల్లిని ఆనుకుని ఉన్న ప్రగతీనగర్ పరిసర ప్రాంతాల్లో మాత్రం వింత పరిస్థితులు నెలకున్నాయి. ముఖ్యంగా ప్రగతీ నగర్, నిజాంపేట్‌లో లోల్డ్ అపార్ట్మెంట్‌లలో ఫ్లాట్లు కొనేందుకు ఆసక్తి చూపేవారు లేక, ఇటు ఓనర్స్ , అటు దళారీలు చుక్కలు చూస్తున్నారు. ఫ్లాట్ ఫర్ సేల్ అని బోర్డు పెట్టి నెలలు గడుస్తున్నా, వామ్మో ఈ ఫ్లాట్లు మాకొద్దంటూ కొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో గత ఏడాదిన్నర కాలంగా ఈ ప్రాంతాల్లో అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. 12ఏళ్ల క్రితం బ్యాచిలర్స్ గా ఉన్నప్పుడు కొనేశాం. ఇప్పుడు ఇక్కడ అమ్మేద్దాం అంటే కొనేవాళ్లు లేరంటూ ఇంటి ఓనర్స్‌లో నిరుత్సాహం నెలకొంది.కూకట్‌పల్లిని ఆనుకుని, ఐటీ కంపెనీలకు అందుబాటు దూరంలో ఉన్న ప్రగతీ నగర్, నిజాంపేట్ ప్రాంతాల్లో సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్ కొనాలంటే తక్కువలో తక్కువ 40లక్షలకుపైగా చెల్లించాలి. డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ ఐతే జీఎస్ టీతో కలిపి 85 లక్షలకుపైమాటే, అయితే ఇంత ఖర్చు చేసి కొందామంటే, ఇప్పటికే ఆ నిర్మాణాలు 15ఏళ్ల క్రితం కట్టినవి కావడంతో అన్ని లక్షలు పోసి, మరీ అంత పాత ఫ్లాట్లు అవసరమా అనే ఉద్దేశ్యంతో లైట్ తీసుకుంటున్నారు కొనుగోలుదారులు.ఈ ప్రాంతాల్లో ఇళ్లు పాత నిర్మాణాలని అనుకుంటున్న సమయంలో మూలిగే నక్కపై హైడ్రా బుల్డోజర్ పడ్డట్టు, ప్రగతీ నగర్, నిజాంపేట్ పరిసర ప్రాంతాల్లో హైడ్రా భయం ఫ్లాట్ల కొనుగోలు, అమ్మకాలపై స్పష్టంగా కనిపిస్తోంది. అపార్ట్మెంట్‌లో ఫ్లాట్ కొందామంటే, పంచాయితీ అనుమతితో ఎప్పుడో నిర్మించారు, ఏ చెరువు పరిధిలో ఆక్రమణ అని హైడ్రా కూల్చేస్తే, మొత్తానికి మునిగిపోతామనే భయం వినియోగదారులను వెంటాడుతోంది. దీంతో సాధారణ రోజుల్లో జరిగే అమ్మకాల్లో కనీసం 15శాతం కూడా జరగడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.ఇదిలా ఉంటే ఆది నిష్టూరం కంటే అంత్య నిష్టూరం మేలన్నట్లు, నెలల తరబడి వేచి ఉంటే అక్కడక్కడా, అరకొరగా ఫ్లాట్లు అమ్మకాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా అపార్ట్మెంట్ నిర్మించిన ఏడాది ఆధారంగా కొనుగోలు చేసే వారి సంఖ్య ఎక్కువగా కనిపిస్తోంది. 6ఏళ్ల క్రితం కట్టిన నిర్మాణాలు కొనేందుకు మాత్రమే ఆసక్తి చూపుతున్నారు. దీంతో 10ఏళు దాటిన నిర్మాణాలు, ఫ్లాట్ ఫర్ సేల్ అంటూ పెట్టిన బోర్డులు నెలల తరబడి, ఎండకు ఎండి, వానకు తడిచిపోతున్నాయే తప్ప. ఈ ప్రాంతాల్లో ఏజ్ బార్ ఫ్లాట్లు మాత్రం అమ్ముడుకావడంలేదు.నేను గత 24 ఏళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాను. ఇప్పుడు ప్రగతీ నగర్ పరిసర ప్రాంతాల్లో ఇళ్ల కొనుగోళ్లు 50శాతంపైగా నిలిచిపోయాయి. హైడ్రా ఏర్పాటు చేసిన నాటి నుంచి ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. చెరువుకు దూరంగా ఉన్నా కొనేందుకు వెనకాడుతున్నారు. హైడ్రా క్లియరెన్స్ సర్టిఫికేట్ ఉందా అని అడుగుతున్నారు. 3వ ఫ్లోర్‌కు రిజిస్ట్రేషన్స్ లేకపోవడంతో కొనేందుకు ఆసక్తి చూపడం లేదు. అనుమతులు లేకుండా నిర్మించి ఫ్లోర్ లు కొనాలంటే లోన్లు రావడంలేదు. ఎక్కువ శాతం మంది లోన్ ద్వారానే ఇళ్ల కొనుగోలు చేస్తుంటారు. -మహ్మద్ అబ్దుల్ నబీ, ప్రగతీనగర్, హైదరాబాద్నేను 20ఏళ్లుగా రియల్ ఎస్టేట్ లో ఉన్నాను. 40లక్షల నుంచి 60 లక్షల బడ్జెట్ లోపు ఇళ్ల అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రస్తుతం 10ఏళ్ల క్రితం కట్టిన ఇళ్లు 32లక్షల నుంచి 40లక్షల లోపు సింగిల్ బెడ్ రూమ్ ధర పలుకుతోంది. ఇప్పుడు ఇంటి అద్దెలు కూడా పెరగడంతో కొంత మంది కొని ,ఇళ్లు అద్దెకు ఇచ్చేస్తున్నారు. నిజాంపేట్ పరిధిలో ఇళ్ల అమ్మకాలు, కొనుగోళ్లు విపరీతంగా తగ్గాయి. మేం ఇళ్లు అమ్మాలని చూస్తుంటే కొనేవాళ్లు రావడంలేదు. ఒకవేళ కొనడానికి ముందుకొచ్చినా, వాళ్లు చెల్లించే ధర , మేం అనుకున్న దానికంటే చాలా తక్కువగా ఉంటోంది. దీంతో ఏళ్ల తరబడి కొన్ని ఇళ్లు సేల్ బోర్డులతోనే సరిపెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

## జేబులు ఖాళీ చేస్తున్న క్యాబ్ దందా

హైదరాబాద్, మే 4 సామాన్యులు భాగ్యనగరంలో క్యాబ్‌లు, ఆటోల్లో ప్రయాణించాలంటే దడ పుట్టించే ధరలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రయాణికుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని అగ్రిగేటర్ సంస్థలు, డ్రైవర్లు అడ్డగోలుగా ఛార్జీలు వసూలు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయిఒక ప్రయాణికుడు ఒకే మార్గంలో తరచుగా ప్రయాణిస్తుంటే, సదరు యాప్ అల్గారిథమ్ దానిని విశ్లేషించి ధరను పెంచుతోంది. గతంలో రూ. 200 ఉన్న రూట్లలో ప్రస్తుతం రూ. 350 వరకు వసూలు చేస్తున్నారు. పీక్ అవర్స్‌లో ఒక్కో ప్రయాణంపై రూ. 200 నుండి రూ. 300 వరకు అదనంగా భారం పడుతోంది.గ్యాస్, డీజిల్ కొరత పేరుతో డ్రైవర్లు ప్రయాణికుల నుండి అదనపు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. క్యాబ్ బుక్ అయిన తర్వాత ఫోన్ చేసి గమ్యస్థానాన్ని అడిగి, ఎక్కువ ఇస్తేనే వస్తామని షరతులు విధిస్తున్నారు. తెల్లవారుజామున లేదా రాత్రి వేళల్లో రైల్వే స్టేషన్లు, ఎయిర్‌పోర్టులకు వెళ్లే వారిని లక్ష్యంగా చేసుకుని యాప్‌లో ఉన్న ధర కంటే రెండు రెట్లు ఎక్కువ వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఏసీ ఆన్ చేయడానికి కూడా అదనపు ఛార్జీలు డిమాండ్ చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు.ప్రయాణం ఖరారు చేసుకునే ముందు యాప్‌లో ధరను ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలి.ధర విషయంలో డ్రైవర్లకు ముందే స్పష్టత ఇవ్వడం ద్వారా అదనపు వసూళ్లకు అవకాశం ఉండదు.ఒకే యాప్‌పై ఆధారపడకుండా వేర్వేరు యాప్‌లను వాడటం వల్ల రాయితీలు పొందే వీలుంటుంది.డ్రైవర్ అనుచితంగా ప్రవర్తిస్తే యాప్‌లో ఫిర్యాదు చేయడం ద్వారా వారికి రేటింగ్ తగ్గుతుంది.క్యాబ్‌ల అధిక ధరలపై స్పందించిన హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## గో రక్షణ చట్టం అమలు చేయటంలో ప్రభుత్వం విఫలం

### గోవులను కాపాడడంలో హిందూ సంఘాల కార్యకర్తల కృషి అభినందనీయం

### గోరక్షకుల పోరాటంలో అండగా నిలబడండి

### అఖిల భారత గోసేవ ఫౌండేషన్ అధ్యక్షులు బాలకృష్ణ గురుస్వామి

,మే 4 (భారత శక్తి ): గోవు విశ్వ మాత మన అందరి తల్లిగోవుల ఉనికిని కాపాడుకోవటం హిందువుల ప్రథమ కర్తవ్యం ప్రతి ఇంటిలో అవును పోషించాలి జ్యోతిర్వాస్తు విద్యాపీఠం మహేశ్వర సిద్ధాంతి 'గో'రక్షణ చట్టం అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం అయిందని ప్రభుత్వం చేయని పని గోరక్షకులు చేస్తున్నారని అఖిల భారత 'గో'సేవ ఫౌండేషన్ అధ్యక్షులు బాలకృష్ణ గురుస్వామి అన్నారు. సంగారెడ్డి జిల్లా పసల్వాడి లో శ్రీ జ్యోతిర్వాస్తు విద్యా పీఠం లో జరిగిన గోరక్ష సమ్మేళనములో అఖిల భారత గోసేవ ఫౌండేషన్ అధ్యక్షులు బాలకృష్ణ గురుస్వామి ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం గో రక్షణ చట్టం అమలుచేయటం లో విఫలం అయిందన్నారు. గోవులను కాపాడుట కోసం అనేకమంది గోరక్షకులు, హిందూ సంఘాల కార్యకర్తలు నిరంతరం పనిచేస్తున్నారన్న సందర్భంగా గోరక్షకులకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి అండగా నిలబడాల్సిన బాధ్యత నాయకులదన్నారు. గో రక్షకులకు కష్టం వచ్చినపుడు నేను ఉన్నాను అంటూ నాయకులు గోరక్షకుల పక్కన నిలవండి అదే వారికి కొండంత ధైర్యాని ఇస్తుందని అన్నారు.సమావేశాన్నిద్దేశించి జ్యోతిర్వాస్తు విద్యాపీఠం నిర్వాహకులు మహేశ్వర సిద్ధాంతి మాట్లాడుతూ.. గోవు విశ్వమాత మన అందరి తల్లి అని అన్నారు. హిందువులు తల్లిగా భావించే గోమాతను కాపాడుకోవాలన్నారు. హిందువుల ఉనికి గోమాత మనుగడతో ముడిపడి ఉందని గోవుల ఉనికిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువు పై ఉందన్నారు. ప్రతి ఇంటిలో ఒక ఆవును పెంచుకోవడం ద్వారా గోసంతతిని వృద్ధి చేయాలని సూచించారు. గోవు మానవాళికి ఎంతో మేలు చేస్తుందని మానవ మనుగడ గో ఆదారితమైనదని అన్నారు. విహెచ్ పి స్టేట్ కో కన్వీనర్ అడ్వకేట్ జివిఎల్.నరసింహారావు మాట్లాడుతూ.. గో రక్షణ చట్టం ఆధారంగా గోవులను కాపాడమని ప్రభుత్వాన్ని కోరుతున్నా గోరక్షణ చట్టం అమలు చేయటంలో అలసత్వం వహిస్తుందన్నారు. కార్యకర్తలే స్వయంగా గోవులను రక్షించేందుకు నడుం బిగిస్తున్నారని అయితే గోవుల రక్షణలో కార్యకర్తలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేసులు కూడా ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. గో రక్షకులు ఎటువంటి కేసులకు భయపడాల్సిన పనిలేదని తాము అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.విహెచ్ పి గో రక్ష ప్రముఖ్ సుభాష్ చందర్ మాట్లాడుతూ.. గో మాపియాదారులను అడ్డుకొంటాం అక్రమ రవాణా దారులకు అడ్డుకట్ట వేస్తాం ప్రభుత్వం గో రక్షణ చట్టం అమలు చేయటం కోసం పోరాటం చేస్తాం అన్నారు. గోవుల ద్వారా లభించే గో ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ ఉపయోగించాలన్నారు. గో ఉత్పత్తుల తయారీలో ఆసక్తి గలవారికి అవసరమైన మెలుకువలు నేర్పిస్తామన్నారు. హిందూ రాజకీయ నాయకులు మారినప్పుడే హిందూ ధర్మం రక్షించబడుతుందని ఉద్ఘాటించారు. కార్యక్రమలో విహెచ్ పి జిల్లా ప్రెసిడెంట్ పవన్ కుమార్, జిల్లా కార్యదర్శి జయరాం రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు రవి, బజరంగ్ దళ్ విభాగ్ ప్రముఖ్ మనోజ్, జిల్లా ప్రముఖ్ లక్ష్మణ్ చిరంజీవి, బీజేపీ నాయకు కొండాపూర్ జగన్, ఆర్ఎస్ఎస్ నాయకు సురేష్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హోం గార్డు కుటుంబానికి రూ.30 లక్షల ఆర్థిక సహాయం

నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 04 (భారత శక్తి): బాసర పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న వెంకట రమణ అనే హోం గార్డు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మృతి చెందారు. ఈ నేపథ్యంలో యాక్సిడెంటల్ బెనిఫిట్ స్కీమ్ కింద మృతుడి కుటుంబానికి రూ. 30 లక్షల చెక్కును జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తన చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది సంక్షేమం పట్ల ప్రభుత్వం మరియు పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటాయని తెలిపారు. మృతుడి కుటుంబానికి ఈ ఆర్థిక సహాయం కొంతమేరకు ఆదరణగా నిలుస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.



# 6న మెగా జాబ్ మేళా కె ఆర్ కె కాలనీ, మైనారిటీ గురుకులము, ఆదిలాబాద్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మే 04(భారత శక్తి) ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొని యువతకు ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలను అందించనున్నాయి. ఐటీ, హెల్త్ కేర్, ఇండస్ట్రియల్, ఫార్మా, రిటైల్, బ్యాంకింగ్, ఫైనాన్స్, మార్కెటింగ్, సేవా రంగాలకు చెందిన సంస్థలు పాల్గొననున్నాయి.

పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ తదితర అర్హతలు కలిగిన అభ్యర్థులకు అనేక ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు తమ అర్హతలకు అనుగుణంగా ఉద్యోగాలను ఎంపిక చేసుకొని అవసరమైన ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

ఆసక్తి గల యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నమోదు కోసం వెబ్‌సైట్: https://satg.telangana.gov.in/prajapalana/ అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, అనుభవ పత్రాలు తదితర అవసరమైన ధ్రువపత్రాలతో హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు: డివైఎస్ఓ, నిర్మల్ శ్రీకాంత్ రెడ్డి 9346655441 ని సంప్రదించాలన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 04(భారత శక్తి) వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.

సోమవారం సారంగాపూర్ మండలం ఆలూరు గ్రామంలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. వరి ధాన్యం కొనుగోలు తీరును ఆయన పరిశీలించారు. కొనుగోలుకు సంబంధించి అన్ని రకాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతూ, ధాన్యం అమ్మేందుకు వచ్చే రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, రైతులకు త్రాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. తగినన్ని గన్ని సంచులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. నిర్ణీత తేమశాతానికి రాగానే ధాన్యం తూకం వేసి, వెంటనే వరి ధాన్యాన్ని తరలించాలన్నారు. అధిక ఉష్ణోగ్రతల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆటోమేటిక్ ప్యాడి క్లీనింగ్ యంత్రం పనితీరును పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ, ప్రతి రైతు తమ ధాన్యాన్ని శుభ్రపరచి మాత్రమే తూకానికి ఇవ్వాలన్నారు. ఇలా చేస్తే రైతులు నష్టపోకుండా ఉంటారని వివరించారు. వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిఎం సివిల్ సప్లయిస్ సుధాకర్, తహసిల్దార్ విజయ కాంతారావు, ఎంపీడీవో లక్ష్మీ కాంతరావు, సర్పంచ్ ఈర్ల చిన్నయ్య, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పి జి ఆర్ ఎస్ సమస్యలను సత్వరమే పరిష్కరించండి: జిల్లా ఇంచార్జి డిఆర్వో వెంకటపతి

వై ఎస్ ఆర్ కడప,మే 4 (భారత శక్తి ): అర్జీదారులకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించి ప్రజా సమస్యలను 0 శాతంకి తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇంచార్జి డిఆర్వో వెంకటపతి పేర్కొన్నారు.

సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి జిల్లా ఇంచార్జి డిఆర్వో వెంకటపతి తోపాటు పలువురు జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ఎస్ వ్యవస్థ ద్వారా అర్జీదారులకు సంతృప్తి కరమైన, నాణ్యమైన వేగవంతమైన పరిష్కారాన్ని అందిస్తోందన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

వేసవిలో అర్జీదారుల ప్రజల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలో సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేలా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అధికారులకు సూచించారు.

ముఖ్యంగా ప్రజల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలోనే ప్రజల సమస్యలను స్థానికంగానే గుర్తించి మండల స్థాయిలోనే పరిష్కరించేలా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెవెన్యూ క్లినిక్ ల ద్వారా భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు

1) ప్రొద్దుటూరు టీచర్స్ కాలనీకి చెందిన టి. సుదర్శన్



రెడ్డి తనకు ఆరోగ్యం సరిగా లేదని, రెండు కిడ్నీలు డయాలసిస్ చేయించుకోవడానికి ప్రతి నెలా 15 వేలు ఖర్చవుతుందని, పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు.

2) దువ్వూరు మండలం కానగూడూరు గ్రామంకు చెందిన బి. సుబ్రహ్మణ్యం ఇంటి కుళాయి కనెక్షన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు.

3) చెన్నూరుకు చెందిన తుమ్మల చెన్నయ్య గారి పెంచలమ్మ తనకు 60 ఏళ్ళు పైబడి వయస్సు ఉందని ఆరోగ్య రీత్యా గుండె ఆపరేషన్ చేయించు కున్నానని, ఏ పనీ చేయలేను అని, ప్రభుత్వ పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.

4) కడప కందిపాలెం కు చెందిన మున్నెమ్ పీరయ్య తన రేషన్ కార్డులో రమాదేవి పేరును తొలగించి తనకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు శాంతమ్మ, రంగస్వామి, శివరామిరెడ్డి, జెడ్పి సీఈవో సుబ్రహ్మణ్యం, జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్ అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 04(భారత శక్తి) ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే స్పందించాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని తెలిపారు.

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు.

ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఆర్డీఓ కార్యాలయం నిర్మల్, సబ్ కలెక్టర్ కార్యాలయం భైంసాలో డివిజన్ వారీగా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం



జరుగుతుందని తెలిపారు. మారుమూల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అలాగే గణనలో భాగంగా నిర్వహిస్తున్న సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. అధికారులు తప్పనిసరిగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతు తప్పకుండా మట్టి పరీక్షలు చేసుకోవాలి.



జనగామ జిల్లా ప్రతినిది(భారత శక్తి )మే4:

ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక రైతు సంక్షేమ వారోత్సవాలలో భాగంగా ఈరోజు దేవరుప్పుల మండలం కోలుకొండ గ్రామంలో రైతు వేదిక ప్రాంగణంలో గ్రామ రైతులందరూ ఆధ్వర్యంలో నేల ఆరోగ్య పరిరక్షణ మరియు ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు ఏఇవో శ్యామల అవగాహన కల్పించారు. అందులో భాగంగా ప్రతి రైతు తప్పకుండా వేసవికాలంలో మట్టి పరీక్షలు చేసుకొని దానికి అనుగుణంగా ఎరువుల వాడకం చేసుకోవాలి. అదేవిధంగా సేంద్రియ వ్యవసాయం గురించి కుడా రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా బి ఆర్ ఎస్ యువజన నాయకులు కోతి ప్రవీణ్, గ్రామ వార్డు సభ్యులు వాసర్ల బీరప్ప, కన్నబోయిన నర్సయ్య, గ్రామ రైతులు దావెర పెద్దులు,కుర్నాల రవి, దావెర దశరథ, రామచంద్రు, మాచర్ల ఐలయ్య, మార్జోడు శోభన్, వాసర్ల పర్శరాములు, బీసు రాజు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లాలో ఎండల తీవ్రత

## -దాహంతో కోతి కల్లు తాగిన ఘటన
## -- అటవిశాఖ బాధ్యతలపై దృష్టి.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 04(భారత శక్తి) సారంగాపూర్ మండలం అడెల్లి గ్రామంలో ఎండల తీవ్రత కారణంగా నీటి వనరులు ఎండిపోవడంతో మూగజీవాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో దాహంతో అలమటించిన ఓ కోతి, అడెల్లి ఆలయ పరిసరాల్లో భక్తులు చెట్టు కింద ఉంచిన కల్లును నీరు అనుకొని తాగిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.

ఈ సంఘటన ప్రాంతంలో నెలకొన్న తీవ్రమైన వర్షాభావ పరిస్థితులను స్పష్టంగా చూపిస్తోంది. అడవులకు సమీప ప్రాంతాల్లో నీటి కొరత పెరగడంతో వన్యప్రాణులు గ్రామాల వైపు రావడం, అనుకోని ఘటనలకు దారితీస్తోంది.

అటవిశాఖ చట్టపరమైన బాధ్యతలు: వన్యప్రాణుల సంరక్షణ, వారి సహజ వాతావరణ పరిరక్షణ అటవిశాఖ ప్రధాన బాధ్యతగా చట్టపరంగా నిర్ణయించబడింది. ముఖ్యంగా అడవుల్లో మరియు సమీప ప్రాంతాల్లో వన్యప్రాణులకు తాగునీటి వనరులు ఏర్పాటు చేయడం,వేసవి కాలంలో నీటి కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి తాత్కాలిక నీటి ట్యాంకులు, కుంటలు ఏర్పాటు చేయడం

వన్యప్రాణులు గ్రామాల్లోకి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టడం,గాయపడిన లేదా ప్రమాదంలో ఉన్న జంతువులను రక్షించి పునరావాసం కల్పించడం,వన్యప్రాణుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడం

ఇవి వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ , 1972 ప్రకారం అటవిశాఖపై ఉన్న కీలక బాధ్యతలుగా పేర్కొనబడ్డాయి.

అధికారులు తక్షణ చర్యలు తీసుకుని నీటి వనరులను పునరుద్ధరించడమే కాకుండా, వన్యప్రాణులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

ఇక ప్రజలు కూడా తమ వంతుగా ఇళ్ల వద్ద, దేవాలయాల వద్ద, పొలాల వద్ద నీటి పాత్రలు ఉంచి మూగజీవాల దాహాన్ని తీర్చేందుకు సహకరించాలని పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు.

# ఖబడ్దార్ బీర్ల అయిలయ్య

- మాజీమంత్రి హరీష్ రావుపై అయిలయ్య వ్యాఖ్యలపై భగ్గుమన్న బిఆర్ఎస్
- గుట్టలో భారీ ర్యాలీ అనంతరం దిష్టిబొమ్మ దహనం చేసిన బిఆర్ఎస్ నాయకులు



భారత శక్తి (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి)మే 4: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావుపై ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో ప్రధాన రోడ్డుపై నిరసన ర్యాలీని చేపట్టారు. 'ఖబర్ధార్ అయిలయ్య' బీర్ల అయిలయ్య డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ప్రధాన కూడలి వద్ద బీర్ల అయిలయ్య దిష్టిబొమ్మ దహనం చేశారు. 6 సార్లు ఎమ్మెల్యేగా, ఇరిగేషన్ శాఖ, ఆర్థికశాఖ, వైద్యారోగ్యశాఖ మంత్రిగా రాష్ట్రానికి సేవ చేసిన మాజీ మంత్రి హరీశ్ రావు హోదాను మరిచి, అధిష్టానం మెప్పుకోసం నోటికి వచ్చినట్టుగా మాట్లాడితే సహించేది లేదన్నారు. మాట్లాడేటప్పుడు ఆలోచించి మాట్లాడాలని అధికారంలో ఉన్నామని విర్రవీగి నోరు జారితే తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఇప్పటివరకు వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 30 శాతం వడ్లను కొనుగోలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో రైతులే కర్రకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వెంటనే హరీశ్ రావుకు క్షమాపణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ మాజీ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, యువజన విభాగం నాయకులు ముక్కర్ల సతీష్ యాదవ్, బాలయ్య, సర్పంచ్ గడ్డం దేవేందర్, మాజీ సర్పంచ్ తోటకూరి బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి వినతులను వారం రోజుల్లో పరిష్కరించాలి

## -హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హనుమకొండ ప్రతినిధి(భారత శక్తి)మే4:

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు.

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన వినతులను వారం రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు.

ప్రజలు తమ సమస్యలను వివరించగా, కలెక్టర్ సంబంధిత అంశాలపై వెంటనే స్పందిస్తూ పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు.

పెండింగ్‌లో ఉన్న అర్జీలు లేకుండా చర్యలు తీసుకోవాలని, వారం వారీగా వినతులను పరిష్కరించే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. ఎక్కువ సంఖ్యలో వినతులు వచ్చే శాఖలు ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కారం చూపాలని తెలిపారు.

ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు మొత్తం 143 వినతులను సమర్పించారు.

ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమబెంగాల్, అస్సాం, పుదుచ్చేరి, బిజెపి ఎన్నికల విజయోత్సవ సంబరాలు



రేగొండ, మే 04 (భారత శక్తి) జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల బిజెపి మండల అధ్యక్షులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల గెలుపు భాగంగా మిఠాయి పంచి టపాసులు పేల్చి విజయోత్సవ సంబరాలు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెన్నంపెల్లి పాపయ్య, బిజెపి భూపాలపల్లి మున్సిపల్ నాలుగో వార్డ్ కౌన్సిలర్ బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు కన్నం యుగదీశ్వర్ , మండల ఇంచార్జ్ బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సామల మధుసూదన్ రెడ్డి హాజరైనారు. వెన్నంపెల్లి పాపయ్య మాట్లాడుతూ మూడు రాష్ట్రాల ప్రజలు ఇచ్చిన తీర్పుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఈరోజు కార్యకర్తల కృషి ఫలితం బీజేపీ విజయ శంఖారావం అని తెలియజేశారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కూడా భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని తెలియజేశారు.

అలాగే బిజెపి రాష్ట్ర నాయకులు లింగంపల్లి నర్సింగరావు హాజరై వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ జాతీయ వాదాన్ని ఎంచుకొని ముందుకు పోతున్నదని మూడు రాష్ట్రాల ఎన్నికల్లో గెలవడం సంతోషకరమని, త్వరలో తెలంగాణలో కూడా బిజెపి జెండా ఎగరడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పోల్సాని సునీల్ రావు , ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు తీగల జగ్గన్న, జిల్లా నాయకులు, గన్ రెడ్డి లింగారెడ్డి, శ్రీరాముల సంతోష్ గారు, మొరె సుధాకర్ మండల ప్రధాన కార్యదర్శి దయ్యాల కిరణ్ మండల ఉపాధ్యక్షులు గాండ్ల రమేష్, ఎల్లావుల రాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సయ్యద్ గాలిప్, జిల్లా నాయకులు మాత శంకర్, కౌడగాని రాకేష్, సాధు దేవేందర్, భూత్ అధ్యక్షులు, నిమ్మల రాజేశ్వరరావు, గువ్వ సురేష్, పగడాల మనోహర్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ సేవల వేగవంతానికి కంప్యూటర్ల పంపిణీ : జిల్లా కలెక్టర్




కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే 04 : రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం నుండి సరఫరా చేసిన కంప్యూటర్లను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ చేతుల మీదుగా సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లాలోని 25 మండలాల ఎంపీడీఓలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, "ఉపాధి హామీ పథకంలో పారదర్శకత, వేగవంతమైన సేవల కోసం ప్రతి ఎంపీడీఓ కార్యాలయంలో కంప్యూటర్లు ఏర్పాటు చేస్తున్నాం. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ సిబ్బంది మస్టర్లు, మెజర్‌మెంట్ బుక్‌లు, బిల్లులు ఆన్‌లైన్‌లోనే పూర్తి చేయాలి. కూలీలకు సకాలంలో వేతనాలు అందేలా ఈ కంప్యూటర్లను సద్వినియోగం చేసుకోవాలి" అని ఆదేశించారు. జిల్లాలోని 25 మండల పరిషత్ కార్యాలయాల్లో ఉపాధి హామీ విభాగాల వినియోగం కోసం ఈ కంప్యూటర్లను అందజేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్, జిల్లా జెడ్పీ సీఈఓ చందర్, డీఆర్డీఓ ఎం. సురేందర్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

# నగల దుకాణం దోపిడి కేసు కంటైనర్ లో బైక్ లతో సేఫ్...?

## దోపిడి ముఠాది... పర్లి గ్యాంగ్ ట..?

కరీంనగర్ బ్యూరో, మే 4(భారత శక్తి)




కరీంనగర్ పీఎంజె జ్యూవెలరీ దుకాణంలో భారీ దోపిడి జరిగింది.దొంగతనానికి పాల్పడిన ముఠా ద్విచక్ర వాహనాల్లో పారిపోయారు. ముఠా ఎలా తప్పించుకుంది..? ఏ దారిలో కరీంనగర్ దాటి వెళ్ళారు..? ఏఏ వాహనాలు వినియోగించారు అన్న వివరాలను సేకరించే పనిలో పోలీసులు బృందాలుగా నిమగ్నం అయ్యారు. అయితే ముఠాలోని ఇద్దరిని అరెస్టు చేసినట్టు జరిగిన ప్రచారాన్ని పోలీసులు కొట్టిపారేసి ముఠా గురించి సమగ్ర వివరాలను తెలుసుకొంటున్నారు. ఇదే కోణంలో నేరాలకుపాల్పడే ముఠాల వివరాల గురించి కూడా ఆరా తీస్తున్నారు.

నిఘా కళ్ళుకప్పి..?

దోపిడి ముఠా బైకులే కాకుండా భారీ వాహనాలను వినియోగించే అవకాశం ఉందని ఆ కోణంలో అంచనా వేస్తున్నారు. అపాచీ, పల్సర్ బైక్ వాహనాలను భారీ కంటైనర్ ల్లో ఉంచి సేఫ్ గా తమ గమ్యం చేరుకునేందుకు పక్కా స్కెచ్ వేస్తారని తెలుస్తోంది. తమ లక్ష్యం కోసం స్వస్థలాల నుంచి బయలుదేరేప్పుడు కంటైనర్ లాంటి భారీ వాహనం లేదా హైటెక్ టైప్ బస్సులను వినియోగిస్తారని అనుమానం. బస్సుల్లోని లగేజిని ఉంచే చోట బైకుల టైర్లలో గాలి తీసి అందులో ఉంచుతారని మార్గ మధ్యలో పోలీసుల కదలికలపై నిఘా వేస్తూ ముందుకు సాగుతారని తెలుస్తోంది. పోలీసుల చెకింగ్ ఉన్నట్లయితే భారీ వాహనాల్లో ఉన్న బైకులను కిందకు దింపి టైర్లలో గాలి ఎక్కించి సాధారణ జనం వలె పోలీసుల తనిఖీల పాయింట్లను దాటుతారని సమాచారం.. ఆ తర్వాత బైకులను భారీ వాహనాల్లో ఎక్కించి నేరం గానీ, దోపిడి చేయాలనుకునే ప్రాంతాలకు చేరుకుంటారని తెలిసింది. భారీ వాహనాలను సుదూర ప్రాంతాల్లో పార్క్ చేసి దోపిడి చేసిన తర్వాత బైకులను అందులో ఎక్కించి వెళ్లిపోతారని తెలిసింది. బైక్ పై మొదట బయలుదేరితే కిట్స్ దూరం వెళ్ళిన తర్వాత పల్సర్ బైక్ పై ప్రయాణిస్తారని సమాచారం. దీంతో పోలీసులు తమపై నిఘా వేసిన బైకుల గురించి అంచనా వేయలేరని తాము సేఫ్ గా గమ్యం చేరుకుంటామన్న అంచనాతోనే దోపిడి ఈ విధంగా వ్యవహరిస్తుందని సమాచారం. ఆదివారం పై ఏం జే జ్యూవెలరీ షాపులో చోరికి పాల్పడిన ముఠా కూడా ఇదే విధంగా కంటైనర్ లో పరార్ అయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. బైకులపై ముఠా పరార్ జరగడంతో ప్రతి ఒక్కరి దృష్టి ద్విచక్ర వాహనాలపై ఉంటుందని, దీంతో తాము కంటైనర్ లేదా ఇతర భారీ వాహనాల్లో జర్నీ చేసిన అనుమానం రాదన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని చేస్తున్నట్లు తెలుస్తోంది.

పర్లీ గ్యాంగ్..?

కరీంనగర్ నగల దుకాణంలో దోపిడీకి పాల్పడింది మహారాష్ట్రలోని పర్లి గ్యాంగ్ అయి ఉంటుందన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. అక్కడ నివసిస్తున్న కొన్ని కుటుంబాలు దొంగతనాలు చేయడం వారసత్వంగా సంక్రమిస్తున్నదని సమాచారం. మూడు నుంచి నాలుగు తరాలకు చెందిన వారు ఇలాంటి దోపిడీలకు పాల్పడటం లో సుశిక్షితులయ్యారని సమాచారం ఉంది. గంజాయి సేవించడం టార్గెట్ కొట్టేయడం వీరికి వెన్నతో పెట్టిన విద్య అని నిఘా వర్గాలు సమాచారం ఆధారంగా వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. ఇంపోర్టెడ్ వెపన్స్ కూడా సేకరించగలిగే సత్తా ఉన్న ఈ గ్యాంగ్ గురించి పూర్తి వివరాలు సేకరించినట్లయితే ముఠా గుట్టు దొరికినట్టేనని పోలీసు భావిస్తున్నారు. ఈ ముఠా దోపిడి చేసిన తర్వాత కొత్తపల్లి మండలం బాహుపేట మీదుగా మల్కాపూర్ నుంచి జిల్లా సరిహద్దులు దాటి వెళ్లినట్లు అంచనా వేస్తున్నారు. ముఠా సభ్యులు వేములవాడ లేదా జగిత్యాల రహదారిలో భారీ వాహనాన్ని పార్క్ చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

సాంకేతికత పరిజ్ఞానంతో

భారీ దోపిడీకి పాల్పడిన ముఠా మొబైల్ ఫోన్లు వినియోగించిందా లేదా అన్న కోణంలో సైతం ఆరా తీస్తున్నారు పోలీసులు. అయితే ఆ ప్రాంతంలో మొబైల్ టవర్ల ఆధారంగా అనుమానిత నంబర్లను గుర్తుస్తున్నట్లు సమాచారం. అలాగే సస్పెక్టెడ్ కాంట్రాక్టు లిస్ట్ తయారు చేసిన పోలీసులు వాటిని ఎనలైజ్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. అనుమానిత నంబర్లు స్విచ్ఛాఫ్ అయి ఉండటం, దోపిడి జరిగిన తర్వాతనే స్విచ్ఛాఫ్ కావడంతో ఈ దోపిడి చేసింది ఈ ముఠా సభ్యులు వినియోగించి ఉంటారని పోలీసులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# వరి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి : వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు ఆదేశాలు

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే 04: రాష్ట్ర సివిల్ సప్లైస్ శాఖ మంత్రి, ఇన్‌చార్జ్ మంత్రులు, ప్రధాన కార్యదర్శి, సివిల్ సప్లైస్ కమిషనర్ రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో కలిసి సోమవారం వరి కొనుగోలు అంశంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.



ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

రాబోయే ఐదు రోజుల పాటు అకాల, అనూహ్య వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అన్ని జిల్లా పరిపాలనలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కొనుగోలు చేసిన వరి వర్షాలకు తడవకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జారీ చేసిన ముఖ్య సూచనలు:

- కొనుగోలు చేసిన వరిని తక్షణమే పీపీసీల నుంచి రైస్ మిల్లులు, గోదాములకు తరలించాలి.

- తగినంత తార్పాలిన్‌లు ఏర్పాటు చేసి అన్ని నిల్వలను సరిగా కప్పాలి.

-డన్నేజ్ ఏర్పాటు చేసి తేమ నేలకు తగలకుండా సురక్షితంగా నిల్వ చేయాలి.

- కొనుగోలు కేంద్రాల్లో నీటి నిల్వ లేకుండా డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయాలి.

- వర్షాల సమయంలో పీపీసీల వద్ద 24 గంటల పర్యవేక్షణ నిర్వహించాలి.

-అత్యవసర తరలింపుల కోసం తగిన సిబ్బంది, వాహనాలు సిద్ధంగా ఉంచాలి.

- వరి తరలింపులో అంతరాయం లేకుండా రైస్ మిల్లర్లు, రవాణా సంస్థలతో సమన్వయం కొనసాగించాలి.

~ రైతులకు అవగాహన కల్పించి, వరి గుంపులను కప్పడం, చుట్టూ కాలువలు త్రవ్వడం ద్వారా దిగుబడిని రక్షించుకునేలా సూచించాలి.

రైతుల ప్రయోజనాలను కాపాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సజావుగా, సమర్థవంతంగా వరి కొనుగోలు కొనసాగేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, డీఆర్డీఓ సురేందర్, సివిల్ సప్లైస్ వెంకటేష్, డీఎం శ్రీకాంత్, డీసీఓ రామ్మోహన్, వ్యవసాయ శాఖ అధికారి మోహన్, మార్కెటింగ్ శాఖ అధికారి రమ్య తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద హనుమాన్ జయంతి కి రావలసిందిగా మంత్రి అడ్లూరి కి ఆహ్వానం



జగిత్యాల, మే 04( భారత శక్తి ప్రతినిధి ):ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి పెద్ద జయంతి ఉత్సవాలకు హాజరు కావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి కొండగట్టు దేవాలయ అర్చకులు ఆలయ అధికారులు ఆహ్వాన పత్రికను సోమవారం హైదరాబాద్ లో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వారితో మాట్లాడుతూపెద్ద హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించాలని జయంతి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాటు చేయాలని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని భక్తులకు చలువ పందిళ్ళు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని తక్కువ సమయంలో దర్శనమయ్యే విధంగా ఏర్పాటు చేయాలని ఆలయ అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అలయ కార్యనిర్వాహణాధికారి, మరియు అర్చకులు పాల్గొన్నారు.

# స్నేహ సమ్మర్ క్యాంప్ బాలికల భవిష్యత్తుకు బాటలు వేస్తుంది : జిల్లా కలెక్టర్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మే 04 : 15 నుంచి 18 సంవత్సరాల బాలికల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా సెర్ప్-డీఆర్డీఏ ఆధ్వర్యంలో మే 2 నుంచి జూన్ 10 వరకు 'స్నేహ సమ్మర్ క్యాంప్-2026' నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు.


సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కన్వర్జెన్స్ సమావేశంలో కలెక్టర్ స్నేహ సమ్మర్ క్యాంప్ పోస్టర్, గైడ్ బుక్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "అమ్మాయి బలహీనత కాదు... ఆమె భవిష్యత్తు శక్తి. బాల్య వివాహాల నిరోధం, ఆరోగ్యం, విద్య, కెరీర్ గైడెన్స్, సైబర్ భద్రత, స్వయం రక్షణ వంటి 13 కీలక అంశాలపై ఈ క్యాంపులో అవగాహన కల్పిస్తాం. ప్రతి గ్రామంలోని అర్హులైన బాలికలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి'' అని పిలుపునిచ్చారు. కిషోర బాలిక ఎస్ ఎచ్ జి ల ఏర్పాటు లక్ష్యం

జిల్లాలో 715 కిషోర బాలిక స్వయం సహాయక సంఘాల ఏర్పాటు లక్ష్యంగా నిర్ణయించగా, 04-05-2026 నాటికి 305 ఎస్ ఎచ్ జి లు ఏర్పాటై 42.7 శాతం పురోగతి సాధించినట్లు తెలిపారు.

రాజంపేట మండలం 104.5 శాతంతో లక్ష్యాన్ని అధిగమించగా, బిబిపేట 89.3 శాతం, తాడ్వాయి 75.9 శాతంతో ముందంజలో ఉన్నాయని పేర్కొన్నారు. మిగిలిన మండలాల్లో పురోగతి వేగవంతం చేసి లక్ష్యాన్ని పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు, విఓఏలు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో స్నేహ సమ్మర్ క్యాంప్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సురేందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వర్లు, డీడబ్ల్యూఓ ప్రమీల, డీఈఓ రాజు, జిల్లా వైద్యాధికారి డా. రవీందర్, అడిషనల్ డీఆర్డీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కొడవటంచ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న మహేష్ కుమార్ గౌడ్ దంపతులు.



రేగొండ,మే4(భారత శక్తి): భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం లోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దంపతులు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం రేగొండ మండలంలోని కొడవటంచ గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న పి.సి.సి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దంపతులు, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు లను ముందుగా ఆలయ అర్చకులు, ఆలయ చైర్మన్ నాయినేని సంపత్ రావు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో మహేష్ గౌడ్ దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం ప్రధాన అర్చకులు శ్రీనివాస ఆచార్య స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసి మహేష్ కుమార్ గౌడ్ దంపతులను శాలువాలతో సత్కరించారు. అదేవిధంగా ఆలయ చైర్మన్ సంపత్ రావు పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఆలయాన్ని దర్శించడం చాలా సంతోషంగా ఉందని,.ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఆలయ పునర్నిర్మాణ అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే గండ్ర కృషి అభినందనీయం అన్నారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలపై, రాష్ట్ర ప్రజలపై ఉండాలని ఆ స్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాయినేనీ సంపత్ రావు, మండల పార్టీ అధ్యక్షులు ఇప్పకాయల నరసయ్య, టౌన్ అధ్యక్షులు ఏనుగు రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పబ్బ శ్రీనివాస్ గౌడ్ , మండలం ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు ఏల్దొండి నరేష్, ఉప సర్పంచ్ రాజేష్, కట్ల సదయ్య, కోటి రవికాంత్, ఆలయ సిబ్బంది గోరంట్ల శ్రావణ్, సోన్నాయిల సుధాకర్, నాగుల సుదర్శన్, బోసు రవి, సదరం బిక్షపతి,తదితరులు ఉన్నారు.

# దేవస్థాన అభివృద్ధిలో భూనిర్వాసితులకు న్యాయం చేయాలి

## -దేవాదాయ కమీషనర్ ను కలిసి వినతిపత్రం అందజేసిన బాధితులు



భారత శక్తి (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి)మే 4:తెలంగాణ రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట దేవస్థాన అభివృద్ధిలో భాగస్వామ్యుమైన భూ నిర్వాసితులకు, రైతులకు న్యాయం చేయాలని కోరుతూ పలువురు బాధితులు సోమవారం హైదరాబాదులోని దేవాదాయ కమీషనర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానము పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా ఆలయ అభివృద్ధికి కొండ వెనుక భాగంలో ఉన్న భూములను ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి దేవస్థాన అభివృద్ధికి సహకరిస్తూ మాయొక్క భూములను అందించామని తెలిపారు. దేవస్థాన పునరుద్ధరణ అనంతరం మాకు వ్యాపారము చేయుటకు దుకాణాలు లేదా కొండపై దేవస్థానంలో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తారనే ఆశతో ప్రభుత్వ ఆదేశాలను విస్మరించకుండా కోట్ల రూపాయలలు విలువ చేసే భూములను అప్పగిచామని పేర్కొన్నారు. మాకు తీసుకున్న భూమికి పరిహారం కింద డబ్బులు అందజేశారు కానీ ఇచ్చిన హామీలు మాత్రం నెరవేర్చలేదని వాపోయారు. ప్రస్తుత పరిస్థితుల్లో మేము మా కుటుంబీకులం జీవనోపాధి లేకుండా పోయిందని, బ్రతుకు తెరువు కోసం సొంత ఊరు విడిచి దూరంగా కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నామని, మరికొందరు జీవితాన్ని కోల్పోయి మరణించిన వారు ఉన్నారని తెలిపారు. భూములు కోల్పోయి వ్యవసాయం లేక, ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని మేము ఇచ్చిన భూములలో దేవస్థాన వ్రత మండపాలు, వాహన పూజ, అన్నదాన కాంప్లెక్స్, హెలిపాడ్, గోదాం, వాహనాల పార్కింగ్ వంటివి ఏర్పాటు చేసి భక్తులకు సౌకర్యాలు కలుగచేస్తున్నారు. భూ నిర్వాసితులమైన మేము రోడ్డున పడ్డాము. ఇప్పటికైనా మాపై దయతలచి యాదగిరిగుట్ట పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా ఇండ్లు దుకాణాలు కోల్పోయిన వారికి భూమిపై ఇంటిపై వెలకట్టి ప్రభుత్వ పరిహారంతో (డబ్బులతో) పాటుగా ఉండటానికి నివాస స్థలం, కొండ వెనుక భాగంలో దుకాణాలు ఇచ్చినట్లు మరియు కొండపై ఏమీ కోల్పోని, ఎలాంటి నష్టం వాటిల్లని వ్యాపారులు, దుకాణదారులకు కొండ వెనుక భాగంలో కేటాయించిన దుకాణాల సముదాయాల విధంగా దేవస్థాన అభివృద్ధికి ఇంతలా నష్టపోయిన రైతులకు అందించాలని కోరారు. కావున ఇప్పటికైనా భూ నిర్వాసితులమైన రైతులకు వారికిచ్చిన విధంగా కొండ వెనుక భాగంలో దుకాణాల సముదాయాలను లేదా కొండపై దుకాణాలు లేదా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని విన్నవించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బూడిద సురేందర్, బూడిద నాగరాజు, బూడిద నవీన్ కుమార్, బూడిద జానీ, బూడిద నరసింహ, బూడిద రాములు, బూడిద యాదగిరి, బుగ్గ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల స్థలాల కోసం పాత్రికేయులు సొసైటీ ఏర్పాటుచేసుకోవాలి: అదనపు కలెక్టర్ మహేందర్ జి.

## -అర్హులైన విలేకరులకు అక్రిడేషన్లు,ఇండ్లు నిర్మించి ఇవ్వాలి.



- జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ

ములుగు జిల్లా ప్రతినిధి, మే 04 (భారత శక్తి): జిల్లాలోని పాత్రికేయులు ఇండ్ల స్థలాలను పొందడానికి జిల్లాలో హౌసింగ్ సొసైటీ ఏర్పాటు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహేందర్ జి. అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశపు హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ పాత్రికేయులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ జి మాట్లాడుతూ జిల్లాలో హౌసింగ్ సొసైటీ లేని కారణంగానే ఇండ్ల స్థలాలను కేటాయించడం జరుగలేదని, స్థల పరిశీలన చేసి అర్హులకు ఇండ్ల స్థలాలు కేటాయించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జె.జాక్ కన్వీనర్ గుర్రపు శ్రీధర్ మాట్లాడుతూ అర్హులైన విలేకరులకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయడం తో పాటు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. జిల్లా కేంద్రంలో 2024 సంవత్సరంలో ప్రెస్ క్లబ్ నిర్మాణానికి మంత్రి సీతక్క శంకుస్థాపన చేయగా నేటి వరకు భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని, ఇప్పటికైనా భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు జినుకల ప్రభాకర్, కో- కన్వీనర్లు పోలోజు రామ్మూర్తి, ఎనగందుల కొమురయ్య, మాట్ల సంపత్, సంగ రంజిత్,చల్లగురుగుల రాజు, లకుమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల, మే 4 ( భారత శక్తి ప్రతినిధి ):

ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపుకలెక్టర్ లతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 76ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జనాభా లెక్కల - స్వీయ గణన -2027 పై జిల్లా స్థాయి అధికారులకు ఈరోజు సాయంత్రం ప్రతి ఉన్నతాధికారి తమ కింది స్థాయి ఉద్యోగుల వరకు అందరు సెల్ఫ్ ఏనుమిరేషన్ చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్.లత,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా రైతు వారోత్సవాలు.

## -మండల వ్యవసాయ అధికారి పెద్ద వాసుదేవ రెడ్డి.





రేగొండ,మే 4 (భారత శక్తి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు వారోత్సవాలు రేగొండ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మండల వ్యవసాయ అధికారి (ఏవో) పెద్ది వాసుదేవ రెడ్డి ఆధ్వర్యంలో రైతులతో ఘనంగా నిర్వహించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులలో భాగంగా రైతు వారోత్సవాలు మే 4 నుండి 9 వరకు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా సోమవారం రైతు వారోత్సవ సభకు స్థానిక ఏవో వాసుదేవ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్రస్థాయి పర్యవేక్షకులు మార్కెటింగ్ సంయుక్త సంచాలకులు ఈ మల్లేశం, స్థానిక సర్పంచి వారణాసి మౌనిక, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రమేష్, జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి ఎడ్ల సునీల్ పాల్గొని మాట్లాడారు. రైతులకు చెందిన వివిధ రకాల నేల ఆరోగ్యం, భూసార పరీక్షలు, సమతుల్య ఎరువుల యాజమాన్యం, రాబోవు వానకాలం కు గాను 8 రకాల వరి సన్న రకాల సాగు గురించి అధికారులు రైతులకు రైతు వారోత్సవాల్లో వివరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట స్థాయి పర్యవేక్షకులు మల్లేశం మాట్లాడుతూ.. రాబోవు వానకాలం కు 8 రకాలైన వరి విత్తనాలు దీూ 5204, =చీ= 15048, ఖచీవీ 1638, ఎమీ ూాచీూ, జైశ్రీరామ్, ఔ+ూ 962, ఔ+ూ 44, జీ+ూ 1798 ప్రభుత్వం సూచిస్తున్నవని, అట్టి విత్తనాలనే రైతులు వాడి దిగుబడి తో పాటుగా బోనస్ పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేగొండ సర్పంచ్ వానరాశి మౌనిక, భూపాలపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సునీల్, మండల వ్యవసాయ అధికారి పెద్ది వాసుదేవ రెడ్డి, మార్కెటింగ్ సెక్రటరీ భూపాలపల్లి, వ్యవసాయ విస్తరణ అధికారులు భరత్,గోవర్ధన్, స్థానిక వ్యవసాయ సీనియర్ రైతులు, మాజీ సర్పంచి ఏడునూతల విజేందర్ రెడ్డి, లింగంపల్లి గోపాలరావు, తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# మే 10న హైదరాబాదులో జరిగే నరేంద్ర మోదీ జనా గ్రహ సభను విజయవంతం చేయాలి: బిజెపి మండల అధ్యక్షులు బండి శ్రీనివాస్



రేగొండ, మే 04 (భారత శక్తి) జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలోని బిజెపి మండల అధ్యక్షులు బండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల సన్నాహ సమావేశం ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెన్నంపల్లి పాపయ్య, మండల ప్రబారి భూపాలపల్లి మున్సిపల్ 4 వ వార్డ్ కౌన్సిలర్ బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు కన్నం యుగదిశ్వర్ , మండల ఇన్చార్జి జిల్లా ఉపాధ్యక్షులు శ్యామల మధుసూదన్ రెడ్డి పాల్గొని వారు మాట్లాడుతూ మే 10న జరగనున్న జనాగ్రహ సభ సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ లో జరగనుంది అని అన్నారు. ఈ సభకు నరేంద్ర మోదీ దేశ ప్రధాన మంత్రిగా మూడోసారి ఎన్నికైన తర్వాత మొదటిసారిగా హైదరాబాద్ కు వస్తున్నారు. తెలంగాణలో పలు అభివృద్ధి పనుల కోసం తెలంగాణకు 7వేల కోట్ల అభివృద్ధి పనులు శంకు స్థాపన చేయడానికి విచ్చేస్తున్నారని వరంగల్ మెగా టెక్స్ టైల్ పార్కును వర్చువల్ గా శంకుస్థాపన చేయనున్నారు. కావున ఈ సభకు అధిక సంఖ్యలో తరలి వెల్లి సభను విజయవంతం చేయవలసిందిగా రేగొండ మండలం గ్రామ బూత్ అధ్యక్షులు, మండల పదాధికారులు, జిల్లా పదాధికారులు, రాష్ట్ర నాయకుల మండల సన్నాహ సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు తీగల జగ్గన్న, జిల్లా నాయకులు శ్రీరాముల సంతోష్ ,మోరే సుధాకర్, మండల ప్రధాన కార్యదర్శి దయ్యాల కిరణ్ ఉపాధ్యక్షులు గాండ్ల రమేష్, ఎల్లావుల రాజు,బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సయ్యద్ గాలిప్, బీజేవైఎం జిల్లా నాయకులు మాత శంకర్, కొడగాని రాకేష్, సాదు దేవేందర్,భూత్ అధ్యక్షులు నిమ్మల రాజేశ్వరరావు, గువ్వ సురేష్, పగడాల మనోహర్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన -మాజీ మంత్రి వర్యులు ఎర్రబెల్లి



జనగామ జిల్లా ప్రతినిది(భారత శక్తి)మే 4:దేవరుప్పుల మండలంలోని (ధర్మాపురం) సీత్య తండ బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ భుక్య విజయ - రవి , కూతురు రజిత - నాగేందర్, వివాహం జరుగుతుండగా సోమవారం వారి ఇంటికి వెల్లి నూతన వధూవరులను రాష్ట్ర మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తో గాంధీ నాయక్, బి ఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి ,బస్వ మల్లేశం, ఏల సుందర్ ,చింత రవి ,గండిపల్లి యాకయ్య, కుతాటి నర్సింలు ,గడ్డం రాజు, పాటు మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు యూత్ సోషల్ మీడియా నాయకులు పాల్గొన్నారు.

## సినిమా

# హారతి పళ్లెంతో త్రిష..
# బర్త్‌డే పోస్టర్ వచ్చేసింది



వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమయ్యారు నటి త్రిష (Trisha). నేడు ఈ బ్యూటీ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో సందడి నెలకొంది. ఒకవైపు అభిమానులు విషెస్ చెబుతుండగా.. మరోవైపు త్రిష నటిస్తోన్న సినిమా అప్‌డేట్స్ వస్తున్నాయి. వశిష్ఠ దర్శకత్వంలో చిరంజీవి హీరోగా రూపొందుతోన్న చిత్రం 'విశ్వంభర'. ఇందులో చిరుకు జోడీగా త్రిష, అషికా రంగనాథ్ నటిస్తున్నారు. త్రిషకు శుభాకాంక్షలు చెబుతూ టీమ్ తాజాగా పోస్టర్ పంచుకుంది. ఇందులో ఆమె అవని పాత్రలో కనిపించనున్నట్లు దర్శకుడు తెలిపారు. 'మీరు 'విశ్వంభర'లో నటించడం వల్ల ఇది మరింత ప్రత్యేకంగా మారింది' అని పేర్కొన్నారు. మెగా మాస్ సినిమా కోసం వేచి ఉండాలని కోరారు. సూర్య హీరోగా ఆర్జే బాలాజీ తెరకెక్కిస్తోన్న సినిమా 'కరుప్పు'. తెలుగులో 'వీరభద్రుడు'. ఇందులో త్రిష లుక్‌ను కూడా తాజాగా విడుదల చేశారు. ఆమె ప్రీతి పాత్రలో నటిస్తున్నట్లు తెలుపుతూ వీడియో పంచుకున్నారు. ఈ చిత్రం మే 14న విడుదల కానుంది.



# నన్ను పెళ్లి చేసుకుంటావా అని శ్రీదేవి అడిగింది: రాజశేఖర్





టాలీవుడ్ సీనియర్ నటుడు రాజశేఖర్ తన వివాహ బంధం వెనుక ఉన్న తెలియని కోణాలను తాజాగా ఒక ఇంటర్వ్యూలో బయటపెట్టారు. కెరీర్ ప్రారంభంలో అగ్ర కథానాయిక శ్రీదేవి తనను పెళ్లి చేసుకోవాలని కోరినట్లు ఆయన సంచలన విషయాన్ని వెల్లడించారు. అయితే, అప్పట్లో తమ కుటుంబంలో కుల కట్టుబాట్లు ఎక్కువగా ఉండటంతో సొంత కులం అమ్మాయినే చేసుకోవాలని తనపై తీవ్ర ఒత్తిడి ఉండేదని రాజశేఖర్ గుర్తు చేసుకున్నారు. ఈ క్రమంలో తన మనసులోని మాటను నటి జీవిత వద్ద ప్రస్తావించగా, ఆమె ఇచ్చిన సమాధానం తనను కదిలించిందని చెప్పారు. "నీకు ఇష్టమైన వ్యక్తిని పెళ్లి చేసుకో.. కానీ నేను మాత్రం జీవితాంతం ఒంటరిగానే ఉండిపోతాను" అని జీవిత చెప్పిందని... దీంతో, ఆమెపై గౌరవం మరింత పెరిగిందని తెలిపారు. ఆ తర్వాత అన్ని అడ్డంకులను అధిగమించి జీవితను రాజశేఖర్ జీవిత భాగస్వామిగా చేసుకున్నారు. దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ ఈ జంట టాలీవుడ్‌లో మోస్ట్ సక్సెస్‌ఫుల్ సెలబ్రిటీ కపుల్‌గా కొనసాగుతుండటం విశేషం.

# విజయ్ పొలిటికల్ ఎంట్రీ.. సెలబ్రిటీల ప్రశంసల జల్లు!



తొలిసారి ఎన్నికల బరిలోకి దిగిన టీవీకే సత్తా చాటుతూ గెలుపు దిశగా పరుగులు తీస్తోంది. దీంతో ఆ పార్టీ అధినేత, అగ్ర కథానాయకుడు విజయ్‌కు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు ప్రారంభమయ్యాయి. సెలబ్రిటీలు విజయ్‌ను ప్రశంసిస్తూ పోస్ట్‌లు పెడుతున్నారు. ఈ విజయం సినిమాను తలపిస్తోందంటూ నాని శుభాకాంక్షలు తెలిపారు.

* ''మొదట అందరూ ఈ పార్టీ గెలుస్తుందా అని సందేహించారు. కానీ, ప్రజలు దానికే పట్టంకట్టారు. మన రాష్ట్రంలోనూ గతంలో ఇలాంటి విజయమే నమోదైంది. ఇప్పుడు మన పక్క రాష్ట్రంలో ఇదే తరహాలో విజయ్ విజిల్ మోగించారు. అంచనాలను తలకిందులు చేస్తూ విజయం సాధించిన ఈ ఎన్నికల ఫలితాలు సినిమాను తలపిస్తున్నాయి. బహుశా ఇదేనేమో రాజకీయం అంటే. స్పష్టమైన మెజారిటీతో విజయ్‌ను తమిళ ప్రజలు గెలిపించారు. వారి నిర్ణయంతో రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు తీయాలని కోరుకుంటున్నా'' నాని.
* ''ప్రజలు తమ తీర్పును స్పష్టంగా చెప్పారు. దశాబ్దాలుగా ఎంతోమంది ప్రయత్నించారు. కానీ, ప్రజలు ఎవరిని కోరుకుంటారో విజయం వారినే వరిస్తుందని మరోసారి రుజువైంది. తమిళ ప్రజలు మార్పు కోసం ఎదురుచూస్తున్నారు.'' వరలక్ష్మి శరత్‌కుమార్
* ''కంగ్రాట్స్ విజయ్. ఇది చారిత్రాత్మక విజయం. గతంలో ఇలాంటి గెలుపు లేదు.. భవిషత్తులో రాదు'' జీవి ప్రకాశ్ కుమార్
* ''అభినందనలు విజయ్. మీపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని చూస్తుంటే ఆనందంగా ఉంది. మరింత బలంగా ముందుకు సాగండి'' టైగర్ ష్రాఫ్
* ''మన భారతీయ సినిమాకు చెందిన విజయ్ విజయం చూస్తుంటే గర్వంగా ఉంది. ఇది ఒక చారిత్రాత్మక విజయం'' నిఖిల్

# జాన్వీ వ్యాఖ్యల దుమారం టీమ్ రియాక్షన్



నటి జాన్వీ కపూర్ తన తాజా ఇంటర్వ్యూలో మద్యం అలవాటు గురించి చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పడు ప్రచారాన్ని ఆమె ఖండించారు. మద్యానికి సంబంధించి తాను చేసిన వ్యాఖ్యలను కొన్ని మీడియా సంస్థలు తప్పగా చిత్రీకరించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో ఆమె మాట్లాడుతూ.. తన జీవితంలో ఎదురైన ఒక బాధాకరమైన సంఘటన తర్వాత మద్యం అలవాటు అయిందని దానినుంచి బయటకు రావడానికి చాలా కష్టపడ్డానని పేర్కొన్నారు. అయితే, దీనిపై వస్తున్న కథనాలు తప్పదోవ పట్టించేలా ఉన్నాయని ఆమె టీమ్ పేర్కొంది. మద్యం వ్యసనంపై అవగాహన కల్పించే 'ఆఫ్ ది రాక్స్' 'అమహా' సంస్థలు నిర్వహించిన పాడకాస్ట్‌లో జాన్వీ మాట్లాడారు. ఆ మాటలను తప్పగా వక్రీకరించా రని సదరు సంస్థలు నోట్ విడుదల చేశాయి. "జాన్వీకపూర్, ఈ కార్యక్రమానికి సంబంధించిన కంటెంట్‌ను కొన్ని మీడియా సంస్థలు తప్పగా ప్రచారం చేయడం మా దృష్టికి వచ్చింది. ఇది చాలా ఆందోళన కలిగించే విషయం. జాన్వీకపూర్ ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా భాగమయ్యారు. ఆమె పంచుకున్న వ్యక్తిగత అనుభవాల వెనక ఉన్న అసలు ఉద్దేశాన్ని, సందర్భాన్ని పక్కదోవ పట్టించేలా ప్రచారం చేయడం సరికాదు" అని పేర్కొన్నాయి. ఈ

# బెంగాల్ ఫలితాలపై హీరో నిఖిల్ 'క్రేజీ' కామెంట్స్!



పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల ట్రెండ్ దేశ రాజకీయాల్లో పెను సంచలనాన్ని సృష్టించింది. మమతా బెనర్జీ టీఎంసీ కోటను బద్ధలు కొట్టి బీజేపీ ఘన విజయం అంచున నిలిచింది. ఈ ఎన్నికల ఫలితాలపై టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ఎక్స్ వేదికగా నిఖిల్ స్పందిస్తూ... బెంగాల్ ఓటర్లు దేనినీ మర్చిపోలేదని, అలాగే ఎవరినీ క్షమించలేదని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా సామాన్య పౌరుల భద్రతను, ప్రజల అవసరాలను నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వానికి అక్కడి ప్రజలు ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పారని నిఖిల్ విశ్లేషించారు. కోల్‌కతాలోని ఆర్.జి. కర్ మెడికల్ కాలేజీలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అమానుష ఘటనను ఉద్దేశించి మాట్లాడిన నిఖిల్... ఇప్పుడు ఆ బాధితురాలికి నిజమైన న్యాయం జరిగిందని అభిప్రాయపడ్డారు.

# తెలంగాణ పై కేంద్రం వివక్షత

: వరి కొనుగోలు, యూరియా సరఫరాలో నిర్లక్ష్యం
* వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
* రైతు వారోత్సవాలకు శ్రీకారం చుట్టిన మంత్రి తుమ్మల
* టీజీ ఆర్గానిక్ యాప్ ప్రారంభం – సేంద్రియ రైతులకు కొత్త దారి.. మంత్రి తుమ్మల





వికారాబాద్, మే 4 (భారత శక్తి ) : వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని ఎస్వీఆర్ గార్డెన్ లో సోమవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికల భాగంగా నిర్వహించిన రైతు వారోత్సవాల కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలనాగేశ్వరరావుఘనంగాప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైతులు పండించిన వివిధ రకాల పండ్లు, ధాన్యాలు, వాణిజ్య పంటలను స్టాళ్ల రూపంలో ప్రదర్శించారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తదితరులు అధికారులతో కలిసి స్టాళ్లను సందర్శించి రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన వేదికపై సేంద్రియ ఉత్పత్తుల క్రయ విక్రయాలకు తోడ్పడే “టీజీ ఆర్గానిక్” యాప్ ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సేంద్రీయ ఎరువులు వాడుతూ పంటలు పండించాలని అన్నారు. ఆరోగ్యమైన జీవితం ఉండాలంటే సేంద్రియ పద్ధతి ద్వారా వ్యవసాయం ముఖ్యమని అన్నారు. ఈ క్రమంలో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులను సన్మానం చేశారు. అనంతరంమీడియా సమావేశంలో మంత్రి తుమ్మలనాగేశ్వరరావు మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించినప్పటికీ వాటిని కొనుగోలు చేయడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని అన్నారు. ముఖ్యంగా వరి కొనుగోలులో వెనుకంజ వేస్తూ తెలంగాణ రైతులను నిర్లక్ష్యం చేస్తున్నదని ఆరోపించారు. దేశంలో అత్యధికంగా వరి పండించే రాష్ట్రంగా తెలంగాణ ఉన్నప్పటికీ, కేంద్రం సిసిఐ, నాఫెడ్ వంటి సంస్థల ద్వారా పంటలను కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. అదేవిధంగా యూరియా, గన్ని బ్యాగులు వంటి అవసరమైన సరఫరాల్లో కూడా కేంద్రం నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు.ఇటీవల అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా గ్యాస్, డీజిల్ కొరత ఏర్పడి రవాణా వ్యవస్థ స్తంభించిందని, దీంతో గన్ని బ్యాగుల సరఫరా నిలిచిపోయి పంట కొనుగోళ్లు ఆలస్యమయ్యాయని మంత్రి తెలిపారు. ఈ వైఫల్యాన్ని రాష్ట్ర ప్రభుత్వంపై నెట్టివేయాలని కేంద్రం కుట్ర పన్నుతోందని ఆరోపించారు.
రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన యూరియా వంటి ఎరువులను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అలాగే “టీజీ ఆర్గానిక్” యాప్ ద్వారా సేంద్రియ రైతులకు మార్కెట్ అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు.కేంద్ర ప్రభుత్వానికి పలుమార్లు లేఖలు రాసి సమస్యలను తెలియజేసినా స్పందన లేకపోవడం బాధాకరమని మంత్రి అన్నారు. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని కేంద్రాన్ని హెచ్చరించారు.తాండూర్‌లో జరిగిన రైతు వారోత్సవాలు రైతుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

* **రైతు సంక్షేమానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెద్ద పీట: ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి**

అదేవిధంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయాన్ని విస్మరించిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేస్తుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో కోట్ పల్లి ప్రాజెక్టుకు నిధులు సాధించడం జరిగిందని గుర్తుచేశారు. యాలాల శివసాగర్ ప్రాజెక్టులను కూడా పూర్తి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. తాండూరు మార్కెట్ యార్డుకు మంచి పేరుందని తాండూరులో కంది బోర్డు ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మల దృష్టికి తెచ్చారు. అదేవిధంగా తాండూరులో కొత్త మార్కెట్ యార్డు టెండర్ ప్రక్రియలో ఉందని, దీంతో పాటు మార్కెట్ కమిటిలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. తాండూరులో టీజీ ఆర్గానిక్ యాప్ ప్రారంభంపై సంతోషం వ్యక్తం చేశారు. రైతులంతా అధికారులు, సైంటిస్టులు ఇచ్చే సలహాలు, సూచనలు పాటించాలని అన్నారు. అనంతరం యాలాల మండలం జుంటుపల్లి దగ్గరలో గల డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ రవి గౌడ్ ఫాం ఆయిల్ తోటను మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఎమ్మెల్యేలు, అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేందర్ మోహన్, డీసీసీ అధ్యక్షుడు ధారసింగ్, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి, ఏఎంసి చైర్మన్ లు పట్లోళ్ళ నర్సింలు, అంజయ్య, మాధవ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.




## మల్కాజ్‌గిరిలో పార్కింగ్ సెగ
# ఒక్కరోజే 2,727 కేసులు!

* **నడిరోడ్డుపై నిలిపితే ఊరుకోం ప్రత్యేక డ్రైవ్‌లో రూ. 5.50 లక్షల జరిమానా**


మల్కాజ్‌గిరి, మే 4 (భారత శక్తి) : నగరంలో ట్రాఫిక్ కష్టాలకు కారణమవుతున్న అడ్డదిడ్డమైన పార్కింగ్‌పై మల్కాజ్‌గిరి ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నిలిపే వారిపై సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. తిరుమలగిరి, మల్కాజ్‌గిరి డివిజన్ల పరిధిలో చేపట్టిన ఈ తనిఖీల్లో భారీగా కేసులు నమోదయ్యాయి.

**ఉల్లంఘనులపై జరిమానాల మోత**

పోలీస్ కమిషనర్ సుమతి ఆదేశాల మేరకు, ట్రాఫిక్ డిసిపి రాహుల్ రెడ్డి పర్యవేక్షణలో ఈ తనిఖీలు జరిగాయి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఒక్కరోజే మొత్తం 2,727 కేసులు నమోదు చేశారు. వీరి నుంచి *రూ. 5,50,100* జరిమానా వసూలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రధానంగా నోపార్కింగ్ జోన్లు, జంక్షన్ల వద్ద ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తున్న వాహనాలపై చర్యలు తీసుకున్నారు.

* **అత్యవసర సేవలకు ఆటంకం కలిగిస్తే కఠినం**

రహదారులపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలపడం వల్ల సాధారణ ప్రయాణికులే కాకుండా, అంబులెన్సులు, ఫైర్ ఇంజన్ల వంటి అత్యవసర వాహనాలు కూడా చిక్కుకుపోతున్నాయని డిసిపి రాహుల్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్న వాహనాలను క్రేన్ల సాయంతో స్టేషన్లకు తరలించారు.




Special Drive Cases on Wrong Parkings/Obstruction of the carriage way Hrs.(04.05.2026)

| S.No. | Police station | Cases | Amount |
|---|---|---|---|
| 1 | Malkajgiri Tr PS | 263 | 29000 |
| 2 | Gopalpuram Tr PS | 682 | 135400 |
| 3 | Jawaharnagar Tr PS | 181 | 39200 |
| | Malkajgiri Tr. Div. | 1126 | 203600 |
| 4 | Trimulgherry Tr PS | 374 | 72100 |
| 5 | Alwal Tr PS | 475 | 186900 |
| 6 | Begumpet Tr PS | 752 | 87500 |
| | Trimulgherry Tr. Div. | 1601 | 346500 |
| | Grand Total | 2727 | 550100 |

**పోలీసుల హెచ్చరికలు:**

* వాహనదారులు నిర్ణీత పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలను నిలపాలి.
* రహదారులపై వాహనాలను వదిలివెళితే క్రేన్ల ద్వారా తరలించి కఠిన చర్యలు తీసుకుంటాం.
* ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి.

ఈ డ్రైవ్‌లో తిరుమలగిరి, మల్కాజ్‌గిరి ఏసీపీలతో పాటు ట్రాఫిక్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# తాండూరులో డబుల్ బెడ్‌రూం ఇళ్ల డ్రా వివాదం

* **ప్రైవేట్ ట్రస్ట్ నిర్వహించిన డ్రా రద్దు చేయాలి: బీజేపీ నేతల డిమాండ్**
* **అర్హులైన పేదలకు అన్యాయం జరిగిందని ఆగ్రహం**
* **కుట్రలో ఉన్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**
* **బీజేపీ నేతల డిమాండ్**



తాండూరు, మే 4 (భారత శక్తి ) : తాండూరు పట్టణంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుల పేరుతో ప్రైవేట్ ట్రస్ట్ నిర్వహించిన డ్రా పై వివాదం చెలరేగింది. ఈ డ్రాను తక్షణమే రద్దు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం తాండూరులోని బీజేపీ నాయకుడు యు. రమేష్ కుమార్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలువురు నేతలు మాట్లాడారు. తాండూరుకు చెందిన ఏస్ జీఎంకే చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ముజీబ్ ఖాన్ ఆధ్వర్యంలో, పేదలకు ప్రభుత్వం కేటాయించాల్సిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను “ఇందిరమ్మ ఇళ్లు” పేరుతో డ్రా నిర్వహించి, కొంతమందికి కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రక్రియలో అధికార యంత్రాంగం ఎవరూ పాల్గొనలేదని, పూర్తిగా అనధికారికంగా ఈ డ్రా నిర్వహించారని వారు ఆరోపించారు. ముఖ్యంగా ఒకే వర్గానికి చెందిన సుమారు 200 మందికి ఇళ్లు కేటాయించడంపై




తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ డ్రాలో మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, అలాగే ఎమ్మెల్యే సోదరుడు శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రోత్సహించారని ఆరోపించారు. ట్రస్ట్‌కు చెందిన వ్యక్తులు, కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే లబ్ధి చేకూరేలా డ్రా నిర్వహించారని విమర్శించారు. దీంతో నిజమైన అర్హులైన పేదలకు ఇళ్లు దక్కే పరిస్థితి లేకుండా పోయిందని బీజేపీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అనధికారిక డ్రాను వెంటనే రద్దు చేయాలని, ఇందులో భాగమైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక ఈ కార్యక్రమంపై ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి ముందుగానే సమాచారం ఉందా అనే అనుమానం వ్యక్తం చేశారు. ట్రస్ట్ తరఫున ఇన్విటేషన్ కార్డులు కూడా ప్రజాప్రతినిధులకు అందించడాన్ని వారు ప్రస్తావించారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అన్ని వర్గాలకు చెందిన నిజమైన లబ్ధిదారులకు పారదర్శకంగా ఇళ్ల కేటాయింపులు జరగాలని విజ్ఞప్తి చేశారు. ఈ మీడియా సమావేశంలో బాలేశ్వర్ గుప్తా, కృష్ణా ముదిరాజ్, భద్రేశ్వర్, అంతారం లలిత, సాహో శ్రీలత, రజిని, పటేల్ విజయ్, దోమ కృష్ణ, శాంతు కుమార్, రమేష్, కౌన్సిలర్లు నాగారం మల్లేశం, శ్రీకాంత్ రెడ్డి, అంతారం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ను మర్యాద పూర్వకంగా కలిసిన నూతన డీఎస్పీ పి.శ్రీనివాస్

నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 04 (భారత శక్తి) నిర్మల్ సబ్ డివిజన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ పి.శ్రీనివాస్ జిల్లా పోలీసు కార్యాలయంలో,జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ,నూతన డీఎస్పీకి శుభాకాంక్షలు తెలియజేసి, విధుల్లో నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, శాంతి భద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. అలాగే నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా స్పందించాలని తెలిపారు.



## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

* **గ్రీవెన్స్ డే ద్వారా ప్రజా సమస్యలకు పారదర్శకంగా తక్షణ పరిష్కారం**
* **జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల.**

నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 04(భారత శక్తి): సోమవారం జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో



మర్యాద పూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా వారి సమస్యలను మా దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.గ్రీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదు పైన సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి, ఫాలోఅప్ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు.బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో చర్యలు తీసుకోవడమే మా ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు.

# ప్రభుత్వ భూముల రక్షణకు పెరిగిన ప్రజా భరోసా




* **హైడ్రా 'ప్రజావాణి'కి పోటెత్తిన ఫిర్యాదులు: ఒకే రోజు 56 వినతులు**

హైదరాబాద్: మే 4 (భారత శక్తి) : ప్రభుత్వ భూముల పరిరక్షణే లక్ష్యంగా పని చేస్తున్న హైడ్రాపై నగర ప్రజల్లో నమ్మకం పెరుగుతోంది. అక్రమ కట్టడాల కూల్చివేతలో హైడ్రా చూపుతున్న తెగువను చూసి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఆక్రమణలపై ప్రజలు పెద్ద ఎత్తున ఫిర్యాదు చేస్తున్నారు. గతంలో ఫిర్యాదు చేసినా ఫలితం ఉండదని భావించేవాళ్లమని, ఇప్పుడు హైడ్రా తక్షణ చర్యలు తీసుకుంటుందనే ధైర్యంతో ముందుకు వస్తున్నామని బాధితులు పేర్కొన్నారు. సోమవారం జరిగిన 'ప్రజావాణి'లో మొత్తం 56 ఫిర్యాదులు అందగా, కమిషనర్ ఏవీ రంగనాథ్ వీటిని పరిశీలించి తక్షణ పరిష్కారానికి అధికారులను ఆదేశించారు.

**క్షేత్రస్థాయిలో ఫిర్యాదుల వివరాలు:**

* గోపన్నపల్లి: రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్నపల్లి గ్రామంలోని 100 అడుగుల రహదారి సమీపంలో ప్రభుత్వ భూమిని రేకులతో ప్రహరీ వేసి ఆక్రమించారని స్థానికులు ఫిర్యాదు చేశారు.
* కుత్బుల్లాపూర్: ఐడీపీఎల్ కాలనీ నుంచి జగద్గిరిగుట్ట వెళ్లే మార్గంలో నాలాలపై అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, దీనివల్ల వర్షాకాలంలో వరద ముప్పు పొంచి ఉందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే జగద్గిరిగుట్ట ప్రాంతంలో ఆలయాల పేరుతో వ్యాపార సముదాయాలు నిర్మించి అక్రమంగా అద్దెలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.
* నాగారం: కీసర మండలం నాగారం గ్రామంలో సర్వే నంబరు 291/3లోని 2.30 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు కోరారు. అదే గ్రామంలోని సర్వే నంబరు 83లో ఉన్న పాత లేఅవుట్‌ను ధ్వంసం చేసి, పార్కులు, రోడ్ల స్థలాలను నోటరీ ద్వారా విక్రయిస్తున్నారని ప్లాట్ల యజమానులు ఫిర్యాదు చేశారు.
* మల్లాపూర్: ఉప్పల్ మండలం మల్లాపూర్ గ్రామంలో సర్వే నంబరు 84లోని సుమారు 2 వేల గజాల ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలకు సన్నాహాలు చేస్తున్నారని, వెంటనే అడ్డుకోవాలని కోరారు.
* బడంగిపేట: బాలాపూర్ మండలం బడంగిపేటలోని సుమారు 14 ఎకరాల విస్తీర్ణం కలిగిన 'మల్లప్పగారి కుంట' చెరువు స్వరూపాన్ని మార్చి ప్లాట్లుగా విక్రయిస్తున్నట్లు ఫిర్యాదు అందింది.
* కుంట్లూరు: పెద్దఅంబర్‌పేట కుంట్లూరులోని ఒక ప్రైవేటు కాలనీలో రహదారులకు అడ్డంగా గోడలు నిర్మించి పక్క కాలనీల దారిని మూసివేస్తున్నారని స్థానికులు హైడ్రాను ఆశ్రయించారు.

**తక్షణ చర్యలకు ఆదేశం:**

ప్రజావాణికి వచ్చిన ప్రతి ఫిర్యాదును కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వ భూములు, చెరువులు, నాలాల ఆక్రమణలపై ఎటువంటి మినహాయింపులు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత క్షేత్రస్థాయి అధికారులకు ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆక్రమణదారులు ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రసాయన శాస్త్రంలో రమేష్ గౌరకు పీహెచ్.డీ.



పటాన్‌చెరు, మే 4 (భారత శక్తి) : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి రమేష్ గౌర డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'మెథిమజోల్, లెవోడోపా, మిటాపివాట్ సల్ఫేట్, వారెనిక్లిన్ టార్ట్రేట్ అనే క్రియాశీల ఔషధ పదార్థాల వినూత్న సంశ్లేషణ పద్ధతుల అభివృద్ధి'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎం.ఎస్.సురేంద్ర బాబు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ రమేష్ చేసిన డాక్టరల్ పరిశోధన, కీలకమైన ఫార్మాస్యూటికల్ సమ్మేళనాల కోసం సమర్థవంతమైన, సురక్షితమైన, ఆర్థికంగా లాభదాయకమైన సంశ్లేషణ మార్గాలను రూపొందించడంపై దృష్టి సారించినట్టు తెలిపారు. డాక్టర్ రమేష్ నాలుగు ముఖ్యమైన క్రియాశీల ఔషధ పదార్థాల (ఏపీఐల) కోసం నూతన, విస్తరించదగిన ప్రక్రియలను అభివృద్ధి చేసి, తద్వారా దిగుబడి, మలినాల నియంత్రణ, ప్రక్రియ భద్రత, పారిశ్రామిక సాధ్యతను గణనీయంగా మెరుగుపరిచినట్టు వివరించారు. ముఖ్యంగా, ఆయన చేసిన కృషిలో మెథమజోల్ కోసం క్వాలిటీ బై డిజైన్ (క్యూబీడీ) ఆధారిత పటిష్టమైన ప్రక్రియ, లెనోడోపా కోసం సరళీకృత రెండు దశల సంశ్లేషణ, మిటాపివాట్ సల్ఫేట్ కోసం ఆప్టిమైజ్ చేసిన బహుళ దశల మార్గం, అధిక స్వచ్ఛత, నియంత్రణ సమ్మతిని నిర్ధారించే వేరెనిక్లిన్ టార్ట్రేట్ కోసం నైట్రోసమైన్ రహిత మార్గం ఉన్నాయని రుజువు చేశాడన్నారు. అధునాతన విశ్లేషణాత్మక లక్షణాల మద్దతుతో ఆయన చేసిన పరిశోధన, ఔషధ తయారీకి ఆచరణాత్మక, పరిశ్రమకు సంబంధించిన పరిష్కారాలను అందిస్తూ, ప్రాసెస్ కెమిస్ట్రీ రంగంలో విలువైన పురోగతికి దోహదపడుతుందని తెలిపారు. డాక్టర్ రమేష్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

* **అబ్దుల్లాపూర్‌మెట్ రైతు వేదికలో అవగాహన సదస్సు**
* **గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి**




అబ్దుల్లాపూర్‌మెట్, మే 4 (భారత శక్తి) : రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, వీటిని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి సూచించారు. 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా సోమవారం నుంచి శనివారం వరకు నిర్వహిస్తున్న 'రైతు వారం' కార్యక్రమంలో భాగంగా అబ్దుల్లాపూర్‌మెట్ రైతు వేదికలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

* **ధాన్యం కొనుగోళ్లకు ప్రాధాన్యం**

రైతు పండించిన ప్రతి గింజకూ గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8 వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మార్కెట్ ధరతో సమానంగా ధాన్యం సేకరిస్తున్నామని, అన్ని రకాల పంటలకు మద్దతు ధర కల్పిస్తున్నామని చెప్పారు. కల్తీ విత్తనాల విక్రయాలను ఉక్కుపాదంతో అణిచివేశామని స్పష్టం చేశారు.

* **సేంద్రియ సాగుతో అధిక లాభాలు**

రైతులు రసాయన ఎరువులకు స్వస్తి చెప్పి, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని మధుసూదన్ రెడ్డి సూచించారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. గత పాలనలో పేరుకుపోయిన అప్పుల వల్ల ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, వాటన్నింటినీ అధిగమించి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

* **పత్రాల పంపిణీ**

అనంతరం రైతులతో ప్రతిజ్ఞ చేయించి, భూసార పరీక్షలు చేయించుకున్న రైతులకు భూసార ఆరోగ్య కార్డులను (గుర్తింపు పత్రాలు) అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర చారి, స్థానిక ప్రజాప్రతినిధులు విజయ శ్రీశైలం గౌడ్, కోట ప్రభాకర్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు పద్మజ, అరుణ, పల్లవి మరియు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణం

* **వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి**



ఇబ్రహీంపట్నం, మే 4 (భారతశక్తి) : ఇబ్రహీంపట్నం కేంద్రంలో శ్రీ మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ఆధ్యాత్మిక శోభ**

మంగళవాయిద్యాలు, వేదమంత్రాల సాక్షిగా జరిగిన కల్యాణ వేడుకతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మికతతో నిండిపోయింది. నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రార్థించారు. భక్తుల రద్దీ దృష్ట్యా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**సంప్రదాయాల పరిరక్షణ**

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతిబింబించే ఇలాంటి ఉత్సవాలు ఐక్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు. కులదైవాల పట్ల భక్తి భావం సమాజంలో నైతిక విలువలను పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలగొద్దు

* **అధికారులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశం.**
* **వడదెబ్బతో మృతి చెందిన రైతు కుటుంబానికి రూ.50 వేల సాయం**



ఇబ్రహీంపట్నం, మే 4 (భారత శక్తి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశించారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున రైతులు కల్లాల వద్ద ఎక్కువ సమయం వేచి ఉండకుండా, ఉదయం వేళల్లోనే తూకం ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.

**రైతు కుటుంబానికి పరామర్శ**

రాయపోల్ గ్రామంలో కొనుగోలు కేంద్రం వద్ద వడదెబ్బకు గురై మరణించిన రైతు గౌరయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. బాధిత కుటుంబానికి దండుమైలారం సహకార కేంద్రం తరపున రూ.50 వేల తక్షణ ఆర్థిక సాయాన్ని అందజేశారు. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి పరిహారం అందేలా చూస్తామని, కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.

**సౌకర్యాల కల్పనపై హెచ్చరిక:**

కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బంది కలగకుండా అధికారులు కింది చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు:

* నీడ, తాగునీరు: కేంద్రాల వద్ద తప్పనిసరిగా టెంట్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి.
* సామగ్రి లభ్యత: అవసరమైన మేర గూనీ సంచులు, తూకం యంత్రాలు, తేమ కొలిచే పరికరాలను సిద్ధంగా ఉంచాలి.
* వేగవంతం: ధాన్యం సేకరణను వేగవంతం చేసి వీలైనంత త్వరగా మిల్లులకు తరలించాలి.
* రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ గురునాథ్ రెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## దగాపడ్డ రైతుల పక్షాన పోరాటానికి అరెస్టులా?

* **అరెస్టులతో మా గొంతు నొక్కలేరు"**
* **బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు. రమేష్ కుమార్**







తాండూర్, మే 4 (భారత శక్తి) : వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో సోమవారం రైతు వారోత్సవ కార్యక్రమం నేపథ్యంలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు పర్యట ఉండటంతో ముందస్తుగా పోలీసులు బీజేపీ రాష్ట్ర నాయకుడు యు. రమేష్ కుమార్ తో పాటు కౌన్సిలర్లు నాగారం మల్లేశం, శ్రీకాంత్ రెడ్డి, అంతరం కిరణ్ ,రజిని లను

**ముందస్తుగా అరెస్టు చేశారు.**

కుటుంబ శుభకార్యం జరుగుతున్న సమయంలోనే, తన స్వగ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో ఉన్న రమేష్ కుమార్‌ను కూడా ఉదయం 6 గంటల ప్రాంతంలో పెద్దేముల్ పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా యు. రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందనీ అన్నారు. కానీ మంత్రులు జిల్లాకు వస్తున్నారంటే ముందే మమ్మల్ని అరెస్టు చేయించడం దుర్మార్గ రాజకీయానికి నిదర్శనం" అని అన్నారు.రైతు సమస్యలపై గళం విప్పితే అరెస్టులా? చేస్తారా అని ప్రశ్నించారు. రైతు వారోత్సవాలు ఎవరి కోసం నిర్వహిస్తున్నారని, రూ.2 లక్షల రుణమాఫీ అమలు కాలేదని, రైతు భరోసా అందడం లేదని, గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. మంత్రులను నిలదీయాలనే ఉద్దేశంతోనే తమను అరెస్టు చేశారని ఆరోపించారు. "మమ్మల్ని జైలులో పెట్టినా మా పోరాటం ఆగదుఅని అన్నారు .రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుంది. ముందస్తు అరెస్టులు చేయడం అంటేనే ప్రభుత్వం తన ఓటమిని ఒప్పుకున్నట్టే" అని అన్నారు

## కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మారం రెడ్డి కౌటిల్ రెడ్డి



ఉమ్మడి వరంగల్ బ్యూరో, మే4 (భారత శక్తి): కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మారం రెడ్డి కౌటిల్ రెడ్డి నియామకమయ్యారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సోమవారం నియామక ఉత్తరువులు జారీ చేశారు.. ఈ సందర్భంగా కౌటిల్ రెడ్డి మాట్లాడుతూ తన నియామకాన్నికి సహకరించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఇనుగాల వెంకటరామి రెడ్డి, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఈ. వీ. శ్రీనివాసరావు లకు కృతజ్ఞతలు తెలిపారు.

# వేధిస్తే వదిలేది లేదు: కేటీఆర్

హైదరాబాద్ (భారత శక్తి) : సీఎం రేవంత్‌రెడ్డి (CM Revanth Reddy) కి సిగ్గు, లజ్జ ఉంటే ఇచ్చిన హామీలు అమలు చేయాలని, పనికిమాలిక కేసులతో వేధింపులకు గురిచేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను గాలికొదిలేసి, బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారంటూ మండిపడ్డారు. సోమవారం సంగారెడ్డి జైలులో మన్నె క్రిశాంక్(Manne Krishank) ను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై నిప్పులు చెరిగారు. నేడు రాష్ట్రంలో కేసులు, పనికిమాలిన వేధింపులు చూస్తున్నం. క్రిశాంక్ తెలంగాణ ఉద్యమ సమయంలో ఒక ధృవతారగా అప్పుడున్న పరిస్థితులకు అనుగుణంగా పోరాటం చేశాడు. స్వయంగా తాను న్యాయవాది కూడా. ఈ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిని అడుగడుగునా బయట పెడుతున్నాడు. ప్రజల అరాచకాలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తెస్తున్నడు. ప్రజల్లోకి తీసుకెళ్తున్నడు. ఆయన మీద కోపంతో ఇవాళ పనికిమాలిన కేసులు పెట్టారు. నాలుగేళ్లకు తక్కువ శిక్ష పడే కేసులే. స్టేషన్‌లోనే బెయిల్ ఇచ్చి పంపించాల్సిన కేసులవి. కానీ నేటితో 12వ రోజు జైల్లో ఉండి. ప్రతిసారీ ఇలాగే చేస్తున్నడని దాదాపు 35 కేసులు పెట్టారు అని కేటీఆర్ చెప్పారు.

**సీఎం పైశాచికానందం..**

మిస్ ఇంగ్లండ్‌ను ఇద్దరు కాంగ్రెస్ నేతలు లైంగికంగా వేధించారని మాట్లాడినందుకు, దాన్ని వ్యతిరేకించినందుకు ఆయనపై కేసు పెట్టారు. రేవంత్ రెడ్డి అల్లుడు, వారి బినామీ కంపెనీలు వాటికి సంబంధించిన బాగోతాలు బయటపెడితే ఒక కేసు. రేవంత్ బావమరిది సృజన్‌రెడ్డికి కాంట్రాక్టులు ఎలా ఇస్తారని, కేంద్రం మీరు కుమ్మక్కయ్యారని అది బయటకు తీసుకొస్తే మరొక కేసు. కొండారెడ్డిపల్లిలో మాజీ సర్పంచిని భయపెట్టి ఆయన చావుకు కారణమయ్యారని నిలదీస్తే దానిమీద ఒక కేసు. ఈ రకంగా 35 కేసులు మన్నె క్రిశాంక్ మీద పెట్టారు. అతనితో పాటు మరో పదిమంది కార్యకర్తలను జైల్లో పెట్టి వారి వారి కుటుంబాలకు క్షోభ కలిగిస్తున్నారు. సీఎం పైశాచికానందం పొందుతున్నారు అని ఆయన మండిపడ్డారు.

**నేరాలు, అరాచకాలపై సోయి లేదా?**

బీఆర్ఎస్ సోషల్ మీడియా మీద, బీఆర్ఎస్ నాయకత్వం మీద పెట్టే శ్రద్ధ ఒక్క పైసా రాష్ట్రంలో జరుగుతున్న నేరాలపై, అరాచకాలపై దృష్టి పెట్టండి. నిన్న కరీంనగర్‌లో పట్టపగలే ఒక జ్యువెలరీ దుకాణంలో నలుగురిపై కాల్పులు జరిగాయి. వాళ్లు చావుబతుకుల మధ్య కొట్లాడుతున్నరు. ఇట్లాంటివి వదిలేసి సోషల్ మీడియాలో ఎవరు ట్వీట్ పెట్టారు.. పరువు ఏమవుతుంది అని ఆలోచిస్తున్నరేమో. అసలు మీకు పరువుంటేగా పోవడానికి. నీకు సిగ్గు, లజ్జ ఉంటే ఇచ్చిన హామీలు అమలు చెయ్. అలా కాకుండా తప్పించుకొని తిరుగుతున్నవ్. మీ గురించి ప్రజలు ఏమనుకుంటున్నరో వినే ప్రయత్నం చేయండి. మా నాయకులను వేధిస్తే కొంత తాత్కాలిక ఇబ్బంది ఉంటదేమో. కానీ భయపడేది లేదు. వెనక్కి తగ్గేది లేదు. నీ 420 హామీలు, 13 డిక్లరేషన్లు అమలు చేసే దాకా మేం ప్రశ్నిస్తూనే ఉంటం. పోరాడుతూనే ఉంటం అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు హెచ్చరించారు.

**హైకోర్టు చెప్పినా..**

ఒక కేసులో క్రిశాంక్‌ను అరెస్టు చేయొద్దని హైకోర్టు తీర్పు ఇచ్చింది. పోలీసులేమో అతి చేస్తున్నరు. కోర్టు తీర్పును తుంగలో తొక్కారు. పోలీసు యంత్రాంగం ముఖ్యమంత్రి ప్రైవేట్ ఆర్మీలాగా పని చేస్తుంది. మా ఇండ్ల మీదికొచ్చి సీసీ కెమెరాలు హ్యాక్ చేయడం, మా ఫోన్లు హ్యాక్ చేయడం. బెంగళూరు నుంచి హ్యాకర్లను తెచ్చి ఫోన్లను హ్యాక్ చేయడం. ఎవరెవరు ఏమేం మాట్లాడుతున్నరో తెలుసుకొనే ప్రయత్నం చేయడం. జర్నలిస్టులను ఇబ్బంది పెట్టడం, భయపెట్టడం. వారి ఫోన్లను కూడా ఇవాళ గమనించడం.. ఇవన్నీ పనికి మాలినవి పనులు అని కేటీఆర్ విమర్శించారు.

# తమిళనాడు ఓటర్లకు మోదీ కృతజ్ఞతలు.. విజయ్ పార్టీకి అభినందనలు

చెన్నై/న్యూఢిల్లీ, మే 4 : 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. ఈ ఎన్నికల్లో తమ నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్డీయే)కు మద్దతుగా నిలిచిన తమిళనాడు ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో, తొలిసారి ఎన్నికల బరిలో నిలిచి సత్తా చాటిన నటుడు విజయ్, ఆయన పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు అభినందనలు తెలియజేశారు. ఫలితాల వెల్లడి అనంతరం సోమవారం సోషల్ మీడియా వేదికగా మోదీ ఒక సందేశం పోస్ట్ చేశారు. "తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏకు మద్దతు పలికిన ఓటర్లకు నా కృతజ్ఞతలు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో, వారి జీవితాలను మెరుగుపరచడంలో మేము ఎల్లప్పుడూ ముందుంటాం" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. తమిళనాడు రాజకీయాల్లో దశాబ్దాలుగా ద్రవిడ పార్టీల ఆధిపత్యం కొనసాగుతున్న తరుణంలో, టీవీకే అరంగేట్రంతోనే కీలక శక్తిగా అవతరించింది. ఈ నేపథ్యంలో విజయ్ పార్టీ ప్రదర్శనను ప్రధాని అభినందించడం ప్రాధాన్యత సంతరించుకుంది. "టీవీకే అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. వారికి నా అభినందనలు" అని మోదీ తన సందేశంలో జోడించారు. తమిళనాడు అభివృద్ధికి, అక్కడి ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల వృద్ధి, ఆర్థిక ప్రగతి, సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు మరింత మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. "తమిళనాడు పురోగతికి, ప్రజల శ్రేయస్సుకు కేంద్రం అన్ని విధాలా సహకరిస్తుంది" అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో టీవీకే రూపంలో ఒక కొత్త రాజకీయ శక్తి ఎదుగుతున్న తరుణంలో, తమిళనాడుతో రాజకీయంగా, అభివృద్ధి పరంగా మరింత బలమైన సంబంధాన్ని కొనసాగించాలన్న ఎన్డీఏ ఉద్దేశాన్ని ప్రధాని సందేశం స్పష్టం చేస్తోంది.

# కేరళ కాంగ్రెస్ విజయం.. రేవంత్ రెడ్డి భావోద్వేగ ట్వీట్

హైదరాబాద్ (భారత శక్తి) :కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. తాను కేరళలో ప్రచారం చేసిన ఫొటోలను కూడా పంచుకున్నారు. కేరళలో యూడీఎఫ్ కూటమి అసాధారణ, స్ఫూర్తిదాయకమైన విజయం సాధించిందని పేర్కొన్నారు. ఇందుకు కూటమి నాయకులకు, కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు. చారిత్రాత్మక విజయానికి ప్రధాన కారకులు అంటూ రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, వేణుగోపాల్, దీపాదాస్ మున్షీలకు కూడా అభినందనలు తెలిపారు. తాను ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నప్పుడు ఎంతోమంది యూడీఎఫ్ మద్దతుదారులు, కేరళ ప్రజలు తనపై ఎంతో అభిమానం చూపించారని గుర్తు చేసుకుని రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ, కేరళ రాష్ట్రాలలో ప్రగతిశీల విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి అధికంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ రెండు రాష్ట్రాలు కూడా అభివృద్ధిని విశ్వసిస్తాయని పేర్కొన్నారు. ఈ రెండు రాష్ట్రాలు కూడా దశాబ్ద కాలం పాటు అన్యాయాన్ని ఎదుర్కొని, కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవడం ద్వారా అద్భుతమైన భవిష్యత్తుకు నాంది పలికాయని అన్నారు. కేరళలో కాంగ్రెస్ పార్టీ అద్భుత విజయం సాధించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రగతిశీల పాలన, ప్రజాస్వామ్య విలువలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని ఈ తీర్పు ప్రతిబింబిస్తుందని వ్యాఖ్యానించారు. యూడీఎఫ్‌ను కేరళ ప్రజలు ఆదరించడం ఆనందంగా ఉందని తెలంగాణ రాష్ట్ర మంత్రి అజారుద్దీన్ అన్నారు. ప్రజలు చాలా స్పష్టమైన తీర్పు ఇచ్చారని అన్నారు.

# టీవీకే గెలుపు.. కరూర్ మృతులకు నివాళి

చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రక విజయం సాధించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ, తమ గెలుపును కరూర్ తొక్కిసలాట మృతులకు అంకితమిచ్చింది. ఎన్నికల ప్రచారంలో జరిగిన ఈ దుర్ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. "ఈ చారిత్రక విజయాన్ని కరూర్‌లో మనం కోల్పోయిన 41 మంది కుటుంబాలకు అంకితమిస్తున్నాం" అని టీవీకే నేత ఆధవ అర్జున ప్రకటించారు. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించాయి. నటుడు విజయ్ నాయకత్వంలోని టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించి, ఐదు దశాబ్దాలకు పైగా కొనసాగిన డీఎంకే, ఏఐఏడీఎంకేల ఆధిపత్యానికి గండికొట్టింది. మహిళలు విజయ్‌ను తమ కొడుకుగా, సోదరుడిగా భావించి మద్దతు ఇవ్వడం వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆధవ అర్జున తెలిపారు. ఈ తీర్పును ఒక విప్లవంగా అభివర్ణించిన ఆయన, కరూర్ ఘటనకు డీఎంకేదే బాధ్యత అని ఆరోపించారు. ఫలితాల అనంతరం పార్టీ ఫిరాయింపులను నిరోధించేందుకు టీవీకే అధిష్ఠానం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. గెలిచిన ఎమ్మెల్యేలను చెన్నై సమీపంలోని ఒక ప్రైవేట్ రిసార్టుకు తరలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో టీవీకేతో పొత్తు పెట్టుకునే అవకాశాలపై కాంగ్రెస్ పార్టీ తమ అధిష్టానానికి నివేదిక పంపినట్లు సమాచారం. విజయ్ విజయంపై కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం అభినందనలు తెలిపారు. గతంలో రజనీకాంత్, కమల్ హాసన్ వంటి నటుల రాజకీయ ప్రవేశానికి భిన్నంగా, క్షేత్రస్థాయిలో యువతను, మార్పు కోరుకునే వర్గాలను ఏకం చేసి విజయ్ ఈ విజయాన్ని అందుకున్నారు. ఈ ఫలితాలతో తమిళనాడు రాజకీయాల్లో ఒక నూతన అధ్యాయం మొదలైందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## రాజకీయ చరిత్రకు
# తమిళులే దిక్సూచి: కవిత

హైదరాబాద్ (భారత శక్తి) : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ అధినేత్రి కవిత స్పందించారు. భ్రష్టుపట్టిపోయిన ఈ రాజకీయ చరిత్రను తిరగ రాయడానికి కొత్త రాజకీయ శక్తులు అవసరమని తమిళ ప్రజలు నిరూపించారని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ఉన్న వాళ్లతో విసిగిపోయాం. అధికార దాహార్తులతో వేసారిపోయాం. భ్రష్టుపట్టిపోయిన ఈ రాజకీయ చరిత్రను తిరగ రాయడానికి 'కొత్త రాజకీయ శక్తులు' అవసరమని దేశానికి తమిళ ప్రజలు ఒక సంకేతం పంపారు" అని ట్వీట్ చేశారు. కవిత కూడా పది రోజుల క్రితం తన కొత్త పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్త రాజకీయ శక్తుల అవసరాన్ని ప్రజలు గుర్తించారని అభిప్రాయపడ్డారు. సాయంత్రం 4.30 గంటల సమయానికి టీవీకే పార్టీ 24 స్థానాల్లో నెగ్గి, 82 చోట్ల ఆధిక్యంలో ఉంది. అధికార డీఎంకే 13 స్థానాల్లో నెగ్గి, 58 సీట్లలో ముందంజలో ఉంది. అన్నాడీఎంకే 10 సీట్లు గెలుచుకుని, 46 స్థానాల్లో ఆధిక్యంలో నిలిచింది.

# భారత్ పై ఆసిమ్ మునీర్ కొత్త కుట్ర.. ఉగ్రవాదులను రెచ్చగొట్టడమే లక్ష్యం!


ఢిల్లీ : పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్, భారత్‌పై సరికొత్త కుట్రపూరిత వ్యూహంతో ముందుకెళ్తున్నారు. తన దేశంలో తెహ్రీక్‌ఏతాలిబన్ (టీటీపీ), బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) జరుపుతున్న దాడుల వెనుక భారత్ హస్తం ఉందంటూ తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నారు. పాకిస్థాన్ స్వయంకృతాపరాధమే ఈ సమస్యలకు కారణమని స్పష్టంగా తెలుస్తున్నా, మునీర్ ఈ ప్రచారాన్ని ఉధృతం చేయడం వెనుక ఒక స్పష్టమైన లక్ష్యం ఉందని భారత ఇంటెలిజెన్స్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. జైష్‌ఏమొహమ్మద్, లష్కర్‌ఏతొయిబా వంటి ఉగ్రవాద సంస్థలను మళ్లీ భారత్‌పై దాడులకు ఉసిగొల్పడమే ఆయన అసలు ఉద్దేశం. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పాకిస్థాన్ సైన్యం పరువు కోల్పోవడంతో, ఆసిమ్ మునీర్ తీవ్ర ఒత్తిడిలో ఉన్నారు. పహల్గామ్ దాడికి ప్రతీకారంగా చేపట్టిన ఈ ఆపరేషన్‌కు ముందు, "భారత్‌ను తూర్పు నుంచి నాశనం చేయడం ప్రారంభిస్తాం" అంటూ ఆయన గంభీరమైన ప్రకటనలు చేశారు. అయితే, ఆ ఆపరేషన్ విఫలమవడంతో ఇప్పుడు సొంత దేశంలో ఆయనకు ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఈ అవమానం నుంచి బయటపడేందుకు, ప్రజల దృష్టిని మళ్లించేందుకు మునీర్ భారత్‌పై నిందలు మోపుతున్నారని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జైష్, లష్కర్ వంటి ఉగ్రవాద సంస్థలు పునరేకీకరణ అవుతున్నప్పటికీ ఆ ప్రక్రియ పాక్ సైన్యం, ఐఎస్ఐ ఆశించిన స్థాయిలో జరగడం లేదు. ఐఎస్ఐ నిధులు, వనరులు సమకూరుస్తున్నా, ఆ సంస్థల నాయకత్వంలో నైతిక స్థైర్యం కొరవడిందని, భారత్‌పై వెంటనే దాడులు చేసేందుకు అవి విముఖంగా ఉన్నాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. వారిలో భారత్‌పై ద్వేషాన్ని మరింత తీవ్రతరం చేసి, దాడులకు పురిగొల్పేందుకే మునీర్ ఈ ఆరోపణల పర్వాన్ని ఎంచుకున్నారని తెలుస్తోంది. మరోవైపు ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లతో యుద్ధం విషయంలోనూ మునీర్ అనుసరించిన వ్యూహం బెడిసికొట్టింది. ఆ వైఫల్యం నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి కూడా భారత్‌పై విమర్శలు ఆయనకు ఒక ఆయుధంగా మారాయి. కశ్మీర్‌లో దాడులు చేయడంలో అనుభవం ఉన్న లష్కర్, జైష్‌లను రంగంలోకి దించకుండా పాకిస్థాన్ తన ప్రాక్సీ యుద్ధాన్ని కొనసాగించలేదు. అందుకే ఆ సంస్థలలో మళ్లీ కసి రగిలించేందుకు మునీర్ ఈ ప్రచారాన్ని వాడుకుంటున్నారు. భారత సైన్యం సరిహద్దుల్లో అత్యంత అప్రమత్తంగా ఉండటంతో ఉగ్రవాదుల చొరబాటు యత్నాలన్నీ విఫలమవుతున్నాయి. అయినప్పటికీ, పాకిస్థాన్ నిస్పృహలో ఉందని, మునీర్ రెచ్చగొట్టే ప్రసంగాల నేపథ్యంలో కశ్మీర్‌లో ఒక భారీ దాడికి తెగించే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

## బెంగాల్లో విజయం సాధించాం..
# తదుపరి లక్ష్యం తెలంగాణ

హైదరాబాద్ (భారత శక్తి) :పశ్చిమ బెంగాల్‌లో విజయం సాధించామని, అస్సోంను తిరిగి నిలబెట్టుకున్నామని, ఇక తమ తదుపరి లక్ష్యం తెలంగాణ అని రాష్ట్ర బీజేపీ నాయకులు ప్రకటించారు. రెండు రాష్ట్రాల్లో బీజేపీ విజయం దిశగా దూసుకెళ్లటంతో హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో నాయకులు సంబరాలు చేసుకున్నారు. టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ జెండా ఎగురుతుందని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ వైఫల్యాలతో తెలంగాణ ప్రజలు విసిగిపోయారని అన్నారు. ప్రజలు మార్పు కోసం చూస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీ ఒక రాష్ట్రం తర్వాత మరో రాష్ట్రాన్ని కైవసం చేసుకుంటోందని, ఈ నేపథ్యంలో తెలంగాణలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర పురోగతి కోరుకుంటున్న ప్రజలు డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే సాధ్యమని భావిస్తున్నారని అన్నారు. బెంగాల్‌లో బీజేపీ చారిత్రాత్మక విజయం సాధించిందని, తమ పార్టీని ఆదరించినందుకు ఆ రాష్ట్ర ప్రజలకు తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్ రావు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో తదుపరి ఎన్నికల్లో బీజేపీ గెలుపు తథ్యమని అన్నారు. దేశంలో బీజేపీ ఏ రాష్ట్రంలో అధికారంలో ఉన్నా, ఆ రాష్ట్ర ప్రజలు తిరిగి తమనే గెలిపిస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్య విలువలతో కూడిన, అవినీతిరహిత, అభివృద్ధి పాలనకు ప్రజలు పట్టం కడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ సహా ఇండియా కూటమి పార్టీలను ప్రజలు ఓడించారని అన్నారు. తమిళనాడులో డీఎంకే కూటమికి కూడా ప్రజలు గుణపాఠం చెప్పారని అన్నారు. ఉత్తర, దక్షిణ భారతదేశం పేరిట రాజకీయాలు చేసే వారికి ప్రజలు సరైన సమాధానం చెప్పారని పేర్కొన్నారు. దేశ ప్రజలు కాంగ్రెస్, ఇండియా కూటమికి వ్యతిరేకంగా ఉన్నారని తాజా ఫలితాలను బట్టి తెలుస్తోందని తెలిపారు. మే 10వ తేదీన ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ పర్యటన ఉందని రామచందర్ రావు గుర్తు చేశారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న సభకు రెండు లక్షలమంది హాజరవుతారని రాష్ట్ర నాయకులు భావిస్తున్నారు. ప్రధాని మోదీకి స్వాగతం పలికేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉండాలని కోరారు. ప్రధాని మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని వ్యాఖ్యానించారు.

# ఢిల్లీ నుంచి బెంగాల్ వరకు... 'కమలం' మ్యాప్‌ను షేర్ చేసిన బీజేపీ

- **భారతదేశం 'మోదీమయం' అంటూ ట్వీట్**
- **ఢిల్లీ నుంచి బెంగాల్ వరకు గెలుపు కేవలం విస్తరణ కాదని వ్యాఖ్య**
- **ప్రగతి పథంలో సాగేందుకు ప్రజలు బీజేపీపై చూపిన విశ్వాసానికి ప్రతీక అని ట్వీట్**




ఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ గెలుపు నేపథ్యంలో బీజేపీ 'ఎక్స్' వేదికగా 'మోదీమయమైన భారత్' అని ట్వీట్ చేసింది. కమలం బెంగాల్‌ను కూడా చేరుకుందని పేర్కొంది. ఢిల్లీ నుంచి బెంగాల్ వరకు గెలుపు కేవలం విస్తరణ కాదని, ప్రగతిపథంలో సాగేందుకు దేశ ప్రజలు తమపై చూపించిన విశ్వాసానికి ప్రతీక అని రాసుకొచ్చింది. ఉత్తరాది నుంచి ఈశాన్యం వరకు మార్పు కొనసాగుతోందని, ఇప్పుడీ ప్రయాణంలో పశ్చిమ బెంగాల్ అనే అతిపెద్ద అధ్యాయం చేరిందని పేర్కొంది. మనందరం కలిసి 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మిద్దామని 'ఎక్స్' వేదికగా పిలుపునిచ్చింది. ఈ మేరకు బీజేపీ ఒంటరిగా, మిత్రపక్షాలతో కలిసి అధికారంలో ఉన్న రాష్ట్రాలతో మ్యాప్‌ను పంచుకుంది. హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గోవా, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, త్రిపుర, అస్సోం, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, సిక్కిం, బీహార్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో బీజేపీ, మిత్రపక్షాలు అధికారంలో ఉన్నాయంటూ కాషాయం రంగుతో మ్యాప్‌ను ట్వీట్ చేసింది. దీని ప్రకారం, తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఝార్ఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్, మిజోరాంలలో బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్నాయి.

# లిపులేఖ్ పై మళ్లీ వివాదం.. కైలాస యాత్రపై భారత్‌కు నేపాల్ అభ్యంతరం

నేపాల్: కైలాస మానస సరోవర యాత్ర విషయంలో భారత్, నేపాల్ మధ్య మరోసారి సరిహద్దు వివాదం రాజుకుంది. ఈ యాత్ర కోసం ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ కనుమ మార్గాన్ని ఉపయోగించడాన్ని నేపాల్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆ ప్రాంతం తమ భూభాగమని, తమ అనుమతి లేకుండా అక్కడ ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఆదివారం ఖాట్మండూలో నేపాల్ విదేశాంగ శాఖ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది.

**ఏమిటీ వివాదం?**

ప్రతిష్ఠాత్మకమైన కైలాస మానస సరోవర యాత్ర 2026ను జూన్ నుంచి ఆగస్టు మధ్య నిర్వహించనున్నట్లు భారత విదేశాంగ శాఖ ఇటీవల ప్రకటించింది. సిక్కింలోని నాథూ లా, ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్ అనే రెండు మార్గాల ద్వారా యాత్ర కొనసాగుతుందని తెలిపింది. ఇందుకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు కూడా ప్రారంభమయ్యాయి. అయితే, ఈ నిర్ణయంపై నేపాల్ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తమతో సంప్రదించకుండా, తమ భూభాగంపై ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని ఆరోపించింది. ఈ అంశాన్ని దౌత్య మార్గాల ద్వారా భారత్, చైనా దృష్టికి తీసుకెళ్లామని తెలిపింది.

# బడంగ్‌పేటలో పారిశుధ్య పనులపై అధికారుల : సమీక్ష

* **ఉదయం 7 గంటలకల్లా చెత్తను తొలగించాలి: డిప్యూటీ కమిషనర్ ఆదేశం**



బడంగ్‌పేట, మే 4 (భారత శక్తి) : షంషాబాద్ జోన్ పరిధిలోని బడంగ్‌పేట్ సర్కిల్ 16లో పారిశుధ్య నిర్వహణను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారుల బృందం నిర్ణయించింది. సోమవారం డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో శానిటేషన్ పనులపై ప్రత్యేక సమీక్ష సమావేశం జరిగింది. నగర పరిశుభ్రతలో ఎటువంటి అలసత్వం వహించినా ఉపేక్షించేది లేదని అధికారులు స్పష్టం చేశారు.

**క్షేత్రస్థాయి పర్యవేక్షణే కీలకం**

> పారిశుధ్య నిర్వహణలో పర్యవేక్షణ లోపించకూడదని సమావేశం నొక్కి చెప్పింది. కొత్తగా బాధ్యతలు చేపట్టిన సూపర్వైజర్లకు కీలక సూచనలు చేశారు:

> ముందస్తు విధులు: సూపర్వైజర్లు ప్రతిరోజూ ఉదయం 5:00 గంటలకే క్షేత్రస్థాయిలో విధులకు హాజరు కావాలి.

> గడువులోగా తరలింపు: ఉదయం 7:00 గంటల లోపు రహదారులపై ఉన్న చెత్తను పూర్తిగా తొలగించి, డంపింగ్ యార్డుకు తరలించాలి.

> నిరంతర నిఘా: ప్రధాన రహదారుల వెంబడి స్వీపింగ్ (ఊడ్చే) పనులు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అన్నది నిరంతరం పర్యవేక్షించాలి.

**వాణిజ్య సముదాయాలకు నిబంధనలు**

ప్రతి వాణిజ్య దుకాణం తప్పనిసరిగా "డస్ట్‌బిన్" ఏర్పాటు చేసుకోవాలని అధికారులు ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, SAT (చెత్త సేకరణ వాహనాల) ద్వారా గృహాల నుంచి సేకరించే చెత్తను క్రమబద్ధీకరించాలని చర్చించారు.

**బాధ్యులపై చర్యలు తప్పవు**

పారిశుధ్య ప్రమాణాలు పాటించడంలో ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించినా, విధుల్లో అమలు లోపం కనిపించినా కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, AE (SWM) గంగాప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రాము మరియు ఇతర సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# పాలమూరురంగారెడ్డి జాప్యంపై సమరభేరి!

* **8న భారీ ఆందోళనకు టీఆర్ఎస్ పిలుపు**



హైదరాబాద్, మే 4 (భారత శక్తి) : పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల్లో జరుగుతున్న జాప్యంపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ఉద్యమ కార్యాచరణ ప్రకటించింది. ఈ నెల 8వ తేదీన జిల్లా వ్యాప్తంగా భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి వెల్లడించారు. సోమవారం హైదరాబాద్‌లో పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతం, తాజా రాజకీయ పరిణామాలు, సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులపై సుదీర్ఘంగా చర్చించారు.

**క్షేత్రస్థాయిలోకి 'కొత్త స్వరం'**

జిల్లాలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు పాండురంగా రెడ్డి తెలిపారు. "కొత్త తరం కోసం.. కొత్త స్వరం" అనే నినాదంతో యువతను రాజకీయాల్లో భాగస్వామ్యం చేస్తామని, పార్టీ ఆశయాలను ప్రతి ఇంటికీ చేరుస్తామని పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడేందుకే టీఆర్ఎస్ సిద్ధమైందని, భవిష్యత్తు రాజకీయాల్లో జిల్లాలో పార్టీ కీలక పాత్ర పోషిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**రైతాంగ ప్రయోజనాలే పరమావధి**

జిల్లా ప్రయోజనాల విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తి లేదని పాండురంగా రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యంగా రైతాంగానికి జీవనాధారమైన పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ఆయన తప్పుబట్టారు. అధినేత్రి కవిత ఆదేశాల మేరకు ఈ నెల 8న చేపట్టబోయే నిరసన కార్యక్రమాలకు రైతులు, ప్రజాసంఘాలు, పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# లంచం తీసుకుంటూ
# ఏసీబీకి చిక్కిన జీహెచ్ఎంసీ ఉద్యోగి

* **ఇంటి అనుమతి కోసం రూ. 5 లక్షల డిమాండ్.. లక్ష తీసుకుంటుండగా అరెస్ట్**

హైదరాబాద్, మే 4 (భారత శక్తి) : ఇంటి నిర్మాణ అనుమతి ఇప్పించేందుకు లంచం డిమాండ్ చేసిన జీహెచ్ఎంసీ జూనియర్ అసిస్టెంట్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు అడ్డంగా దొరికిపోయింది. ఖైరతాబాద్ జోన్ పరిధిలోని బోరబండ సర్కిల్ 37 కార్యాలయంలో రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న బి. శ్రీలతను సోమవారం ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు.

**అసలేం జరిగిందంటే?**

ఒక బాధితుడు తన ఇంటి నిర్మాణ అనుమతి (House Construction Permission) కోసం మీసేవా ద్వారా దరఖాస్తు చేసుకున్నాడు. ఈ ప్రక్రియను వేగవంతం చేసి, అనుమతి పత్రాలు ఇప్పించేందుకు శ్రీలత సదరు బాధితుడిని రూ. 5 లక్షల లంచం డిమాండ్ చేసింది. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు.

**రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు**

ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం, సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు వద్ద ఉన్న రత్నదీప్ సమీపంలో మొదటి విడతగా రూ. లక్ష నగదును శ్రీలత తీసుకుంటుండగా ఏసీబీ సిటీ రేంజ్ I అధికారులు ఆమెపై దాడి చేశారు. ఆమె నుంచి



లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జరిపిన కెమికల్ టెస్టులో శ్రీలత చేతులు పాజిటివ్‌గా తేలడంతో ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

**రిమాండ్‌కు తరలింపు**

అధికారిక విధులను దుర్వినియోగం చేస్తూ, అక్రమ మార్గంలో లబ్ధి పొందేందుకు ప్రయత్నించిన శ్రీలతను నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సింధు శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నంబర్ *1064*కు ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం

* **దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకటస్వామి గౌడ్**
* **ఘనంగా రైతు వారోత్సవాలు**

సిద్దిపేట, మే 4 (భరతశక్తి) : సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలోని అక్బర్‌పేట్ భూంపల్లి మండలం పోతారెడ్డిపేట రైతు వేదికలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకటస్వామి గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకుని అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. రైతుల ఆర్థిక స్థితి మెరుగుపర్చేందుకు రూ.2 లక్షల రుణమాఫీ, సన్న వడ్లకు రూ.500 బోనస్, రైతు భరోసా, ఉచిత విద్యుత్, పంటలకు మద్దతు ధరలు వంటి కార్యక్రమాలు అమలులో ఉన్నాయని వివరించారు. రైతు వేదికలు రైతుల సమస్యల పరిష్కారానికి కీలకమని, ప్రభుత్వం తీసుకొస్తున్న ప్రతి పథకం రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రూపొందించబడిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మౌనిక, ఉప సర్పంచులు దమ్ముగౌని ప్రవీణ్, జీడిపల్లి రమేష్, ఆత్మ కమిటీ డైరెక్టర్ సతీష్, ఏఈఓ అనూష, కూడెల్లి డైరెక్టర్ పుదోజి ప్రభాకర్ చారి, ప్రదీప్ రెడ్డి, బండారి ఆశా గౌడ్, పేరూడి దయాకర్ రెడ్డి, కోరంధ రవీందర్ రెడ్డి, ఎర్రోళ్ల రాజు, వార్డు సభ్యులు, ఐకెపి సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.






# గవర్నర్లు, మంత్రుల పేర్లతో
# ఐపీఎల్ టికెట్ల దందా!

హైదరాబాద్, మే 4 (భారత శక్తి): ఐపీఎల్ క్రికెట్ క్రేజ్‌ను పెట్టుబడిగా మార్చుకుని, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న ప్రముఖుల సంతకాలను ఫోర్జరీ చేస్తూ టికెట్ల దందాకు తెరలేపిన ముఠా గుట్టును ఉప్పల్ పోలీసులు రట్టు చేశారు. సామాన్య ప్రజలను మోసం చేయడమే కాకుండా, ఏకంగా గవర్నర్లు, న్యాయమూర్తులు, మంత్రుల పేర్లను వాడుకుంటూ క్రికెట్ అసోసియేషన్లనే బురిడీ కొట్టించిన ముగ్గురు సభ్యుల ముఠాను సోమవారం అరెస్ట్ చేశారు. గూగుల్ నుంచి లెటర్ హెడ్లు.. నిమిషాల్లో ఫోర్జరీ! నిందితులు అనుసరించిన తీరు అధికారులను విస్తుగొలుపుతోంది. గూగుల్ ద్వారా వివిధ రాష్ట్రాల గవర్నర్లు, కేంద్ర మంత్రులు, హైకోర్టు న్యాయమూర్తుల అధికారిక లెటర్ హెడ్లను నిందితులు డౌన్‌లోడ్ చేసుకునేవారు. వాటిపై ప్రముఖుల సంతకాలను అచ్చుగుద్దినట్లు ఫోర్జరీ చేసి.. హైదరాబాద్ (HCA), తమిళనాడు, కర్ణాటక క్రికెట్ అసోసియేషన్లకు వినతి పత్రాలు పంపేవారు. "మాకు కేటాయించిన వీవీఐపీ కోటాలో కాంప్లిమెంటరీ టికెట్లు జారీ చేయండి" అంటూ ఈ లేఖల ద్వారా అధికారులను నమ్మించేవారు. అలా ఉచితంగా పొందిన ఖరీదైన టికెట్లను బ్లాక్ మార్కెట్లో సామాన్య అభిమానులకు భారీ ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు విచారణలో వెల్లడైంది.

**థార్ వాహనంలో తనిఖీ.. గుట్టు రట్టు**

మే 3వ తేదీన ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం వద్ద ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. పార్కింగ్ ప్రదేశంలో అనుమానాస్పదంగా కనిపించిన ఏపీ రిజిస్ట్రేషన్ (AP40BB6768) కలిగిన మహీంద్రా థార్ వాహనాన్ని ఎస్.ఐ. మాధవరెడ్డి బృందం తనిఖీ చేయగా అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. వారి వద్ద లభించిన నకిలీ పత్రాలు, ఫోర్జరీ చేసిన లేటర్ హెడ్లను చూసి పోలీసులు అవాక్కయ్యారు.

**ముగ్గురి అరెస్ట్.. మరో ముగ్గురు పరారీ**

ఈ కేసులో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా పల్కూరుకు చెందిన గట్టమనేని అశోక్ (రియల్ ఎస్టేట్ వ్యాపారి), కంకనాల దినేష్, సింగమనేని వేణుమాధవ్, అనే ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరితో సంబంధం ఉన్న చెన్నైకి చెందిన ఆశిష్, సెంథిల్, తాన్సిల్ అనే వ్యక్తులు ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

***స్వాధీనం చేసుకున్న వస్తువులు:**

* రూ. 1,10,000విలువైన ఐపీఎల్ టికెట్లు.
* నేరానికి ఉపయోగించిన మహీంద్రా థార్వాహనం.
* 5మొబైల్ ఫోన్లు, 5 ఫోర్జరీ చేసిన అధికారిక లెటర్ హెడ్‌లు.
* మల్కాజిగిరి డీసీపీ సురేష్ కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ ఆపరేషన్ ముఠా ఆగడాలకు చెక్ పెట్టింది. నిందితులను సోమవారం న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. క్రికెట్ అభిమానులు అనధికారిక వ్యక్తుల వద్ద టికెట్లు కొని మోసపోవద్దని పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.